ప్రజాశక్తి

ఆదివారం 12 జనవరి 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

పల్లెకు పయనం...

- కార్లు, బస్సులు, రైళ్లలో స్వస్థలాలకు ప్రయాణం
- జాతీయ రహదారులపై వాహనాల రద్దీ

ప్రజాశక్తి - కంచికచర్ల : నగరం...పల్లెబాట పట్టింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు భారీ సంఖ్యలో తమ తమ స్వస్థలాలైన విజయవాడ, విశాఖపట్నం తదితర పట్టణాలు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు తదితర పల్లెలకు వెళ్లేందుకు బయలుదేరిన కార్లతో ఎన్‌టిఆర్ జిల్లా కీసర టోల్‌గేట్ వద్ద తీవ్ర రద్దీ ఏర్పడింది. తెలుగువారికి అతిపెద్ద పండగైన సంక్రాంతికి ఈఏడాది శని, ఆదివారాల సెలవులు కలిసి రావటంతో కుటుంబ సభ్యులు, బంధువుల కలిసి పండుగ జరుపుకునేందుకు తెలంగాణాలో స్థిరపడిన లక్షలాది మంది కార్లలో రయ్ రయ్ మని వెళుతున్న దృశ్యాలు జాతీయ రహదారిపై

కీసర టోల్‌ప్లాజా వద్ద వాహనాలు

విజయవాడ రైల్వేస్టేషన్‌లో రద్దీ

కనిపిస్తున్నాయి. శనివారం నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలకు ఈనెల 18వ తేదీ వరకు సంక్రాంతి శెలవులు ఇవ్వటంతో సొంత వాహనాల్లో, ఆర్‌టిసి, ప్రైవేటు బస్సుల్లోనూ, రైళ్లలోనూ తమ తమ స్వస్థలాలకు బయలుదేరారు. కుటుంబ సమేతంగా శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్, ఇతర తెలంగాణ జిల్లాల నుంచి బయలు దేరిన వాహనాలు శనివారం ఉదయం ఆంధ్రాలోకి ప్రవేశించాయి. హైదరాబాద్, విజయవాడ జాతీయ రహదారిపై తెలంగాణలోని పంతంగి టోల్‌ప్లాజా నుంచి రద్దీ ప్రారంభమైంది. ఎన్‌టిఆర్ జిల్లాలోని చిల్లకల్లు, కీసర టోల్‌ప్లాజాల వద్ద వేలాది వాహనాలతో రద్దీ భారీగా పెరిగింది. తెలంగాణా వైపు నుండి వచ్చే వాహనాలతో జాతీయ రహదారి మొత్తం చీమలదండులా దర్శనం ఇస్తోంది. కీసర టోల్‌గేట్ వద్ద పెద్దఎత్తున భారీగా వాహనాలు నిలిచిపోయాయి. టోల్‌ఫ్లాజా సిబ్బంది మొత్తం (మిగతా 2లో)

విజయవాడ బస్టాండ్లో ప్రయాణీకుల ఇక్కట్లు

విజయవాడలో ట్రాఫిక్ రద్దీ

విజయవాడ బస్టాండ్లో ప్రయాణీకుల ఇక్కట్లు

చక్రబంధంలో బెజవాడ

- బస్టాండ్ క్యూలో ప్రయాణీకుల ఇక్కట్లు
- బస్సుల కోసం పడిగాపులు

ప్రజాశక్తి-విజయవాడ : నగరంలో ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంది. సంక్రాంతి పండుగకు పయనమైన ప్రయాణీకులతో కిటకిటలాడింది. ఆర్టీసి బస్సులో సీటు దొరకడం, ప్రయాణం ఏమో కానీ...దాని టికెట్ పొందడానికి ప్రయాణికులు గంటల తరబడి క్యూ లైన్లలో మునికాళ్లపై నిరీక్షించక తప్పలేదు. ఈ పరిస్థితి స్థానిక పిఎన్ బస్‌స్టేషన్‌లో శనివారం చోటుచేసుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇదే పరిస్థితి. ప్రధానంగా ఏలూరు, కాకినాడ, రాజమండ్రి, అమలాపురం తదితర గోదావరి జిల్లాల పరిధిలోని పలు పట్టణాలు, గ్రామాలకు వెళ్లేందుకు విజయవాడ కేంద్రంగా ఆర్టీసి సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో...ప్రయాణికుల (మిగతా 2లో)

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - కంచికచర్ల : రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి, తద్వారా తలసరి ఆదాయం పెంచటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎన్‌టిఆర్ జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. కంచికచర్ల మండలం పరిటాలలో శనివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఎన్‌ఆర్‌జిఎస్ నిధులతో నిర్మించిన పశువులు, గొర్రెలు, మేకల షెడ్లను, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థాని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆగష్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి మౌలిక సదూపాయాలైన రోడ్లు, డ్రైనేజీలు , ఇతర సౌకర్యాల కల్పనకు రూ. 4500 కోట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఈ ఏడాది ఎన్‌ఆర్జీఎస్ నిధులు రూ.200 కోటలతో అభివద్ధి పనులకు లక్ష్యం పెట్టుకోవాలన్నారు. పల్లె వెలుగు, గోకులం షెడ్ల కార్యక్రమం జిల్లాలో తొలిసారిగా పరిటాలలో ప్రారంభించినట్లు చెప్పారు. ఈగ్రామంలోనే రెండు షెడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నందిగామలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని, భవన నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలిస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బందిని నియామకాలు చేస్తామన్నారు. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ పరిటాలకు రైల్వే స్టేషన్ రాబోతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌జిఎస్ పీడీ రాము, డీపీఓ లావణ్య, డీఎంహెచ్ఓ సుహాసిని, ఏసిపి తిలక్, తహశీల్దారు జాహ్నవి, ఎంపీడీఓ లక్ష్మీకుమారి, టిడిపి మండల అధ్యక్షులు కోగంటి బాబు, సర్పంచ్ యద్దనపూడి ఆనంద జ్యోత్స్న, ఎన్‌ఎస్‌పి ఎడమ కాలవ ప్రాజెక్ట్ ఛైర్మన్ కోట వీరబాబు పాల్గొన్నారు.

పల్లె పండుగలో మాట్లాడుతున్న మంత్రి సత్య కుమార్

మేరీ మాత ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు : ఎంపి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గుణదల మేరీమాత ఉత్సవాలు ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో జరుగుతాయని, ఈ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మేరీమాత ఉత్సవాలు తమిళనాడు నాగపట్నంలో, రాష్ట్రంలోని విజయవాడలో మాత్రమే జరుగుతాయన్నారు. విజయవాడలో జరిగే ఉత్సవాలకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపడతామన్నారు. గుణదల మేరీమాత ఉత్సవాల సందర్భంగా చర్చి కౌన్సిల్ సభ్యులతో శనివారం కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య హాల్‌లో ఎంఎల్‌ఎ గద్దె రామ్మోహన్, సిపి రాజశేఖర్‌బాబుతో పాటు ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చే యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ ఉత్సవాలకు పది లక్షల మందిపైగా వస్తారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో చర్చి కౌన్సిల్ ప్రెసిడెంట్ ఎన్.విజయరాజు మాట్లాడుతూ విజయవాడ బస్టాండ్, రైల్వే స్టేషన్ నుంచి గుణదల చర్చికి మినీ బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుణదల చర్చి ప్రెసిడెంట్ నువ్వుల విజయబాబు, వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి జోసెప్ బాట్టిస్తా, కోశాధికారి గోలి విజయానంద్ జోసెఫ్ పాల్గొన్నారు.

పోలీసులు నై నై...జూదరులు సైసై...

ప్రజాశక్తి - గన్నవరం : సంక్రాంత్రి సంబరాల పేరుతో హైటెక్ జూదానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సువిశాల ప్రాంగణాల్లో సకల హంగులతో బరులను తీర్చిదిద్దుతున్నారు. వివిఐపిలకు ప్రత్యేకంగా ఎసిలు, కూలర్లు, ఎస్‌ఇడి స్క్రీన్లు వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. క్యాసినో, పేకాట, గుండాట వంటి పలు రకాల జూద క్రీడలు ఏర్పాటు చేస్తున్నారు. కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గంలో పదికిపైగా బరులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. బరి స్థాయిని బట్టి మూడు రోజులకు రూ.30 లక్షల నుంచి రూ.3 కోట్ల వరకు డబ్బులు ఇచ్చేలా నేతలతో ఒప్పందం చేసుకున్నారని తెలుస్తోంది. గన్నవరం నియోజకవర్గం అంపాపురంలో బరి ఏర్పాటు చేసుకోవాలంటే సుమారు రూ.2 కోట్లు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. గత 20 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా రామవరప్పాడు, ఎనికేపాడు, సూరంపల్లి, గన్నవరం ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాల పేరుతో బరులు ఏర్పాటు చేస్తున్నారు. కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా.. ఆ దిశగా ఎలాంటి చర్యలు కనిపించటం లేదనే విమర్శ ఉంది. పేపరు ప్రకటనలు తప్ప ఆ దిశగా చర్యలు తీసుకోవటం లేదు. పోలీసు ఉన్నతాధికారులు సైతం బరుల వైపు కన్నెత్తి చూడరనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఏదేమైనా ఈసారి గన్నవరం నియోజకవర్గంలో భారీఎత్తున జూదం కొనసాగుతుందని అంటున్నారు. బెంగళూరు, హైదరాబాద్, గోవా ప్రాంతాల నుంచి జూదం ఆర్గనైజర్లు ఇక్కడికి వస్తున్నారని చెపుతున్నారు. వాళ్ల ఆధ్వర్యంలోనే ఈ జూదం కేంద్రాలు నడుస్తాయని చెబుతున్నారు.

విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలపండి

సిపిఎం పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ : విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, నాణ్యమైన కరెంటు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం... అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండుసార్లు విద్యుత్ భారాలు మోపి ప్రజల నడ్డి విరిచిందని, ఈనేపథ్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా భోగిమంటల్లో విద్యుత్ బిల్లుల కాపీలు దగ్ధం చేసి నిరసన తెలపాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేలాదిగా ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను విస్మరించి వేల కోట్ల రూపాయల మేర ప్రజలపై విద్యుత్ భారాలు మోపిందని విమర్శించారు. ఇది దుర్మార్గమని పేర్కొన్నారు. పైగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసిందని పేర్కొన్నారు. వీటిపై ఇప్పటికే ప్రజలు వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నారని గుర్తుచేశారు. విద్యుత్ బిల్లులతో రోడ్లపైకి వచ్చి బిల్లులు దగ్ధం చేస్తున్నారని తెలిపారు. విద్యుత్ భారాలు ఆపాలని, అదానీ – సెకీ ఒప్పందాన్ని రద్దుచేయాలని, అవినీతినికి పాల్పడిన దోషులను శిక్షించాలని, స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బహుమతుల ప్రదానం

'శ్రీరామ్స్ స్నేహ'లో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - తాడేపల్లి : గుంటూరు జిల్లా తాడేపల్లి డిమార్ట్ సమీపంలోని శ్రీరామ్స్ స్నేహ అవెన్యూలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అపార్ట్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ముగ్గుల పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు అసోసియేషన్ నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న వారిని అభినందించారు.



మహిళలు వేసిన ముగ్గులు

నేడు పర్ణశాలలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-గూడూరు: ఈ నెల 12వ తేదీన కృష్ణాజిల్లా గూడూరు మండలం పర్ణశాలలో బాబా సాహెబ్ డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్మాణ కమిటీ, పర్ణశాల పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, మచిలీపట్నం ఎంపి వల్లభనేని బాలశౌరి, స్థానిక శాసన సభ్యులు కాగిత కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ డి కె బాలాజీ, జిల్లాలోని వివిధ నియోజకవర్గాల శాసనసభ్యులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

సిపి నేతృత్వంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - విజయవాడ : నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు నేతత్వంలో పోలీస్ అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలిసి సిటీ ఆర్మడ్ రిజర్వు పోలీస్ గ్రౌండ్‌లో సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా జరిగాయి. పోలీస్ పేరేడ్ మైదానంలో బోగిమంటలు, గంగిరెద్దులు, ముత్యాల గొబ్బెమ్మలు, ముగ్గుల రంగవల్లులతో గ్రామం లాగా తయారయ్యి, కర్రసాము, వివిధ సాంసతిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. నగర కమిషనర్ దగ్గరుండి పర్యవేక్షిస్తూ, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పోలీస్ మైదానాన్ని చూస్తే సంక్రాంతి సంబరాలకు ఒక గ్రామానికి వచ్చినట్లు అనిపిస్తుందని అన్నారు. ఎటు చూసినా బోగిమంటలు, గంగిరెద్దులు, ముత్యాల గొబ్బెమ్మలు, ముగ్గుల రంగవల్లులు, సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు సంక్రాంతి పండగ శోభ ఉట్టిపడినట్లుగా ఉందని అన్నారు. ప్రతి ఒక్కరు భేదాభిప్రాయం లేకుండా అన్నదమ్ములుగా అందరూ బాగుండాలి, మనతో పాటు అందరూ బాగుండాలనే సూక్తితో కల్మషం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా జీవనాన్ని గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ఈ విధంగా మీ అందరితో కలిసి గడపడం చాలా సంతోషంగా వుందని అన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలను తెలిపారు. ఇదే సందర్భంలో ట్రాఫిక్ లో హెల్మెట్ వాడకంపై నగరంలో ఏర్పాటుచేసిన

పలు అవగాహన కార్యక్రమాలను సి.పి వివరించారు. ప్రజల్లో హెల్మెట్ పై అవగాహన బాగా పెరిగిందన్నారు. మీడియా కథనాలు కూడా ప్రజల్లో బాగా చైతన్యం తీసుకొచ్చాయన్నారు. బెంజ్ సర్కిల్ వద్ద డ్రోన్ ఏ.ఐ.టూల్ ను ఉపయోగించి 17 నిమిషాల పాటు పరిశీలించగా మొత్తం 1193 మోటార్ వాహనాలు బెంజ్ సర్కిల్ మీదుగా ప్రయాణించగా వాటిల్లో హెల్మెట్ పెట్టుకొని 1004 మంది ప్రయాణించారు. యావరేజ్ గా 84.2 శాతం మంది హెల్మెట్ పై అవగాహన కలిగి హెల్మెట్ ధరించి ప్రయాణించడం జరిగిందన్నారు. శుక్రవారం కేవలం హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లనే రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించడం బాధగా ఉందన్నారు. సాంప్రదాయ క్రీడలను ఆడుతూ ఆహ్లాదంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందించాలని కోరారు. ఈసందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి సి.పి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు గౌతమీ శాలి, తిరుమలేశ్వర రెడ్డి, కృష్ణమూర్తి నాయుడు, ఎస్.వి.డి.ప్రసాద్, ట్రైనీ ఐపిఎస్ మనీషా, ఎడిసిపిలు ఎ.వి.ఎల్.ప్రసన్న కుమార్, ఎం.రాజారావు, కె.కోటేశ్వరరావు, ఎఆర్ ఎసిపి డి.ప్రసాదరావు, ఎసిపిలు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు, ఇతర సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న పోరాటం : లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న పోరాటం చిరస్మరణీయమని, భావితరాలకు స్ఫూర్తి మార్గమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శనివారం వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ లక్ష్మీశ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, ఇన్‌ఛార్జ్ బీసీ సంక్షేమ అధికారి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీఎంసిలో

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద వడ్డే ఓబన్నకు ఘన నివాళులర్పించారు. శనివారం ఉదయం అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి చంద్రశేఖర్, వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అకౌంట్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర రెడ్డి, వీఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

చక్రబంధంలో బెజవాడ

అవస్థలు వర్ణనాతీతం అయింది. విజయవాడ నుంచి పైన పేర్కొన్న ఆయా నగరాలు, పట్టణాలు, గ్రామాలకు ప్రయాణికులను తరలించేందుకు గోదావరి జిల్లాల పరిధిలోని ఆయా డిపోల నుంచి కేటాయించిన స్పెషల్ బస్సులు ప్రయాణికుల రద్దీకనుగుణంగా అందుబాటులో లేకపోవడం, సమయానికి సర్వీసులు రాక ఇక్కడి నుంచి ప్రయాణం చేసేందుకు ప్రయాణికులు అవస్థలు పడాల్సి వచ్చింది. సర్వీసుల కోసం గంటల తరబడి పిఎన్ బస్‌స్టేషన్‌లోనే నిరీక్షించాల్సి వచ్చింది. విజయవాడ నుంచి విశాఖ రూట్‌కు వెళ్లాల్సిన స్పెషల్ సర్వీసులు అందుబాటులో లేకుండా పోయాయి. అంతేగాక ఆయా టోల్‌గేట్స్ వద్ద స్తంభించిన ట్రాఫిక్‌తో సకాలంలో విజయవాడకు చేరుకోకపోవడంతో... కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, తదితర నగరాలు, పట్టణాలకు వెళ్లాల్సిన స్థానిక పిఎన్ బస్‌స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు మొత్తం ప్రయాణికులతో నిండిపోయి కిక్కిరిసిపోయింది. ఇదేరీతిలో మిగిలిన రాయలసీమ, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు వెళ్లాల్సిన ప్రయాణికులతో ప్లాట్‌ఫారాలు కిటకిటలాడాయి. బస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలు ప్రయాణికులతో నిండిపోయి సందడి నెలకొన్నది. అధికారులు మాత్రం రద్దీకనుగుణంగా సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు చేస్తున్న ప్రకటనలు ఆచరణలో అమలు కాలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది. బస్‌స్టేషన్‌లోనే టికెట్లు కోసం క్యూలైన్లలో బారులు తీరారు. టికెట్లు పొందడానికి గంటల తరబడి నిరీక్షించక తప్పలేదు. మరోక వైపున ట్రావెల్స్, కార్లు దందా పెరిగిపోయింది. అందిన కాడికి దండుకోవడమే ట్రావెల్స్ పనిగా పెట్టుకున్నాయి. అయినా ఆర్టీఓ, పోలీసులు, ఆర్టీసి అధికారులు పట్టించుకోవడం లేదు. బస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో భారీ సంఖ్యలో ప్రయివేటుట్రావెల్స్, కార్లు బారులు తీరి స్టేజీ క్యారేజీగా ప్రయాణికులను ఎక్కించుకొని భారీ మొత్తంలో ఆర్టీసి రాబడికి గండికొడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు బహాటంగా వినిపిస్తుంది.

చక్రబంధంలో నగరం.

ప్రయాణికులు, వాహనాల రద్దీతో విజయవాడ నగరం చక్రబంధంలో చిక్కుకుంది. ఎటు చూసినా కిలోమీటర్ల దూరాన వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. ప్రధానంగా వారధి, దుర్గగుడి ఫ్లైవర్, ఎంజి రోడ్డు, కారల్ మార్క్స్ రోడ్డు, బెంజి సర్కిల్ ఫ్లైవర్, రామవరప్పాడు తదితర ఏరియాల్లో రద్దీ విపరీతంగా పెరిగిపోయి వాహనాలు భారీ మొత్తంలో నిలిచిపోయాయి. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయింది. విజయవాడ నుంచి మచిలీపట్నం వెళ్లే బందర్ రోడ్డు పూర్తి రద్దీగా మారింది. గుడివాడ, పామర్రు, వుయ్యూరు, మచిలీపట్నం, పెడన, భీమవరం సహా పలు ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం కావడంతో కిలోమీటర్ల పొడవున వాహనాలు నిలిచిపోయాయి. అలాగే విజయవాడ రైల్వేస్టేషన్ కూడా ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. నగరంలోని కనకదుర్గ వారధి, బెంజిసర్కిల్, రామవరప్పాడు రింగ్, ఎనికేపాడు కూడలి, ఏలూరు రోడ్డు, బందర్ రోడ్డు, బవానీపురం తదితర ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ అయింది. ప్రయాణికులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం కష్టమయింది.

పల్లెకు పయనం

7 లైన్లు ఏర్పాటు చేశారు. అయితే ఫాస్ట్‌ట్రాక్‌లు సరిగా పనిచేయకపోవటంతో ఒక్కో వాహనం ముందుకు వెళ్లడానికి 5 నుంచి 10 నిమిషాల సమయం పడుతోంది. దీంతో టోల్‌ప్లాజా వద్ద వాహనాలు కిలోమీటరు మేర బారులు తీరాయి.

టోల్‌ప్లాజా వద్ద పోలీసుల బందోబస్తు

ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ ఆదేశాలతో నందిగామ ఎసిపి తిలక్ పర్యవేక్షణలో నందిగామ రూరల్ సిఐ చావన్ అధ్వర్యంలో కంచికచర్ల ఎస్ఐ బోనగిరి రాజు శనివారం కీసర టోల్‌ప్లాజా వద్ద తమ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు. టోల్ రుసుము వసూలుకు ఎక్కువ సమయం పట్టకుండా అవసరమైతే అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని టోల్ ప్లాజా యాజమాన్యానికి సూచించారు.

చిల్లకల్లు వద్ద...

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామ సమీపంలోని కొంగర మల్లయ్య గట్టు టోల్‌గేట్ వద్ద తెలంగాణ రాష్ట్రం నుండి భారీ సంఖ్యలో వస్తున్న కార్లతో రద్దీ ఏర్పడింది. భారీ సంఖ్యలో కార్లు, బస్సుల్లో తెలంగాణ నుండి ఆంధ్రకు వచ్చే వాహనాలతో రోడ్లు కిక్కిరిసిపోయాయి.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT VIZIANAGARAM O.S.713/2022

Between:
Sri Putla Ganga Bhavan Rao and 2 others ...Plaintiffs
And:
Sri Mulaguri Raghavendra Prasad and 3 others ...Defendants

SUMMONS

To,
D-1:Sri Mulaguri Raghavendra Prasad S/o. Lakshminarayana, Managing Partner of Sree Lakshmi Ganapathi Estates, D.No. 2-115-1, Akunuru, Vuyyuru Mandal, NTR District, Andhra Pradesh-521245.

Whereas the above named plaintiffs filed the above suit against you for grant of permanent injunction in O.S.713/2022 on the file of the Hon'ble II Addl. Junior Civil Judge at Vizianagaram and the matter stands posted to **27-01-2025** for your appearance. Take notice that in the above proceedings you are hereby directed to appear before the Hon'ble II Addl. Junior Civil Judge, Vizianagaram on **27-01-2025** at **10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
R.V.K. NAIDU,
Advocate
Visakhapatnam
Cell: 9441595993.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT VIZIANAGARAM I.A.695/2022 in O.S.713/2022

Between:
Sri Putla Ganga Bhavan Rao and 2 others ...Petitioners/Plaintiffs
And:
Sri Mulaguri Raghavendra Prasad and 3 others ...Respondents/Defendants

NOTICE

To,
R-1: Sri Mulaguri Raghavendra Prasad, S/o. Lakshminarayana, Managing Partner of Sree Lakshmi Ganapathi Estates, D.No. 2-115-1, Akunuru, Vuyyuru Mandal, NTR District, Andhra Pradesh-521245.

Whereas the above named petitioners filed the above I.A. against you for grant of temporary injunction in I.A.695/2022 in O.S.713/2022 on the file of the Hon'ble II Addl.Junior Civil Judge at Vizianagaram and the matter stands posted to **27-01-2025** for your appearance. Take notice that in the above proceedings you are hereby directed to appear before the Hon'ble II Addl. Junior Civil Judge, Vizianagaram on **27-01-2025** at **10.30 A.M.** either in person orthrough an Advocate, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
R.V.K. NAIDU,
Advocate
Visakhapatnam
Cell: 9441595993.

ప్రకటన

నా క్లయింటు అయిన మాధవి చిట్టిప్రోలు గారి నుండి సంజాయిషీ పొంది ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి నా క్లయింటు ఉదిగ రూపవతి గారి తరఫున జనరల్ పవర్ ఆటార్నీ ఏజంటైన సోమయాజుల రాజేశ్వరరావు గారి వలన క్రయమును పొంది శ్రీ కంచికచర్ల సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకము, డ.నెం.9767/2024రూగా రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు రీత్యా సంక్రమించిన ఆస్తిని వారి కుటుంబ అవసరముల నిమిత్తము విక్రయ ఏర్పాటుచేసియున్నారు. సదరు విషయము తెలుసుకున్న సదరు దలారులు నా క్లయింటుతో సంబంధము లేకుండా నా క్లయింటు ఆస్తిని బేరసారాలు ఆడుతున్నారని తెలియ వచ్చినది. సదరు దలారులను నమ్మి ఏవరైన మోసపోయిన అడ్వాన్సు వగైరాలు ఏమైన జరిపిన యెడల నా క్లయింటుకు ఎటువంటి సంబంధములేదు. సదరు ఆస్తిని ఏవరైన కొనుగోలు చేయదలచిన యెడల నా ద్వారా నా క్లయింటును సంప్రదించి కొనుగోలు ఖరారుచేసుకోగలరు. నా క్లయింటు అనుమతి లేకుండా జరుగు బేరసారాలు ఏమైన నా క్లయింటు దృష్టికి వచ్చిన యెడల ఆమె తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు. షెడ్యూలు:యన్.టి.ఆర్. జిల్లా. కంచికచర్ల సబ్.డి.యిలాకా,కంచికచర్ల మండలం, గనిఆత్కూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన గనిఆత్కూరు గ్రామ తాలూకు సర్వే నెం.143/5ఎ రు దాఖలా చ.గ. 131లు స్థిరాస్థి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు: తూర్పు: వెంపరాల ఆంజనేయులు గారి ఆస్తి హద్దు. అ.65.5లు
దక్షిణం:ఉప్పెర్ల రాఘవమ్మ గారి ఆస్తి హద్దు. అ.18.0లు
పడమర:జామి శివ గారి ఆస్తి హద్దు. అ.65.5లు
ఉత్తరం:ఆర్.అండ్.బి. రోడ్డు హద్దు. అ.18.0లు
యీ నాలుగు హద్దుల మధ్య చ.గ. 131లు లేక చ.మీ.109.533చ్చ నివేశన స్థలము మాత్రం.

ఇట్లు,
ఏనుగుల సురేష్
అడ్వకేట్, మంగళగిరి,
సెల్ నెం. 9866275515

ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా, మా క్లయింటు కృష్ణాజిల్లా, కంకిపాడు మండలం, జగన్నాధపురం గ్రామం, డోర్ నెం. 1-26 కాపురస్తురాలు నాదెళ్ళ వెంకటరత్నం గారి భార్య నాదెళ్ళ సూర్యావతి వారి సూచనల మేరకు దిగువ పేర్కొన్న షెడ్యూలు ఆస్తికి నా క్లయింట్ కృష్ణాజిల్లా, కంకిపాడు మండలం, జగన్నాధపురం గ్రామం కాపురస్తురాలు నాదెళ్ళ నాగయ్య గారి కుమారుడు నాదెళ్ళ వెంకటరత్నం వీరి భార్య నాదెళ్ళ సూర్యావతి తరపున విక్రయ అగ్రిమెంటు కం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఏజెంటు గుడికందుల అమ్మయ్య గారి కుమారుడు గుడికందుల ప్రసాద్ గార్ల ద్వారా రిజిష్టర్ విక్రయ దస్తావేజు నెం. 7472/2012 తేది : 02-11-2012 గా పొందియున్నారు. సదరు ఆస్తికి సంబంధించిన లింక్ దస్తావేజులు అయిన రిజిష్టర్ అస్వాధీన విక్రయ అగ్రిమెంటు కం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు నెం. 5880/2007 తేది : 8-11-2007 మరియు రిజిష్టర్ దఖలు దస్తావేజు నెం. 4779/2007 తేది : 8-8-2007లు వారి యొక్క అధీనంలో పోగొట్టు కున్నట్లు మాకు తెలిపినారు. కావున, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనను ఏ విధమైన అభ్యంతరాలు, క్రయములు, తనఖాలు, భాగాలు, తగాయిదాలు, కోర్టు వ్యవహారాలు మరియు ఏ విధమైన లావాదేవీలు వున్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోగా తగిన ఆధారాలతో లిఖిత పూర్వకంగా రిజిష్టర్ పోస్టు ద్వారా ఈ క్రింది తెలిపిన మా అడ్రస్‌కు పంపగలరు. గడువులోపు ఏ విధమైన అభ్యంతరములు రానియెడల షెడ్యూలు దాఖలా ఆస్తిని నిర్వివాదమైన ఆస్తిగా భావించటం అవుతుంది. గడువు తర్వాత వచ్చు ఎట్టి అభ్యంతరాలు మా క్లయింటును గాని, షెడ్యూలు ఆస్తిని గాని బైండు చేయజాలవు. మరియు పైన తెలిపిన దస్తావేజులు దొరికిన యెడల ఈ క్రింది తెలిపిన మా అడ్రస్‌కు తెలియపరిచి అందజేయగలరు.

షెడ్యూలు

కృష్ణాజిల్లా, కంకిపాడు సబ్ రిజిష్ట్రారు వారి యిలాకా, కంకిపాడు మండలం, జగన్నాధపురం గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన జగన్నాధపురం గ్రామం ఆర్ సర్వే నెం. 202/2 లో చ.గ. 301.8లు లేక 252.33 చ.మీ. ఖాళీ నివేశన స్థలంనకు హద్దులు :
తూర్పు : నాదెళ్ళ సుబ్రహ్మణ్యం గారి స్థలం కొంతవరకు అ. 9 లు వెడల్పుగల మా తాటాకు దారి స్థలము కొంత వరకు
దక్షిణం : కొమిరిశెట్టి వెంకటేశ్వరరావు గారి స్థలం
పడమర : నాదెళ్ళ సంగీతరావు గారి స్థలము
ఉత్తరం : శిరివెళ్ల లీలా ప్రసాద్ వగైరా వార్ల స్థలము

ఇట్లు
కె.సర్వేశ్వరరావు,
కె.అలేఖ్య,
న్యాయవాదులు,
డోర్‌నెం. 14-482, భగత్‌సింగ్ నగర్,
యన్‌టిఆర్ బస్టాప్ ప్రక్కన, యనమలకుదురు,
విజయవాడ. ఫోన్ : 95818 73334.

జూదాలే నిర్వహిస్తే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సాంప్రదాయక క్రీడలు మినహా వాటి పేరుతో జూద కార్యకలాపాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటే సాంప్రదాయక క్రీడల మేలవింపుతో, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆనందోత్సాహాల నడుమ జరిగేదన్నారు. అలా జరగవలసిన పర్వదినాన్ని సంప్రదాయ క్రీడల పేరుతో, చట్ట వ్యతిరేక జూద కార్యకలాపాలను నిర్వహిస్తూ ఎన్నో కుటుంబాలను చిదిమేస్తున్న పందెం రాయుళ్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి వెనకాడ బోమని హెచ్చరించారు. ఎవరైనా సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని, కోడి పందాలు, గుండాట, పేకాట వంటి జూద కార్యకలాపాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వాటిని నిర్వహిం చిన, ప్రోత్సహించిన, సహకరించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జూద క్రీడల వైపు వెళ్ళకుండా ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటుచేసి మైక్‌లో ప్రచారం చేస్తూ సాంప్రదాయ క్రీడలే ముద్దంటు- జూద కార్యకలాపాల జోలికి పోవద్దంటూ విస్తతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. అలాగే మహిళలకు

రంగవల్లులు ఇతర పోటీలు నిర్వహించి సంక్రాంతి పండుగలో వారిని పోలీసు శాఖతోపాటు భాగస్వామ్యం చేస్తున్నామ న్నారు. జిల్లావ్యాప్తంగా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. జూద కార్యకలాపాలకు సంబంధించిన సమా చారం మీ వద్ద ఉంటే సమీప పోలీస్ స్టేషన్కు గాని, డయల్-112 హెల్ప్‌లైన్ నంబర్లు, 9491068906 వాట్సాప్ నంబర్లకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

కోడిపందేలు నిర్వహించొద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని గుడ్లవల్లేరు ఎస్సై ఎన్.వి.వి. సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆటోలో మైక్ ప్రచారాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మండలంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడి పందాలు, పేకాట ఇతర జూజాలు నిర్వహిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ గంగాధర్ ఆదేశించినట్లు తెలిపారు. కావున ప్రజలు సాంప్రదాయ క్రీడలు నిర్వహించుకోవాలని కోరారు.

కోడిపందేలు వద్దంటూ ప్రచారం

ప్రజాశక్తి-గన్నవరం : గన్న వరం డి ఎస్పీ పర్య వేక్షణలో హనుమాన్ జంక్షన్ సిఐ సత్యనారాయణ ఆధ్వ ర్యంలో హనుమాన్ జంక్షన్ ఎస్సై వి.సురేష్ "కోడి పందేలు వద్దు- సాంప్రదాయ క్రీడలు ముద్దు"అనే నినాదంతో బాపులపాడు మండలంలో ప్రచార కార్యక్రమానికి తెర తీశారు. వివిధ గ్రామాల్లో కోడిపందేల బర్రిల వద్దకు తమ సిబ్బందితో వెళ్ళి ప్రచార హెూర్డింగ్ లను ఏర్పాటు చేశారు. వాటి ఎర్పాట్లను నిర్వీర్యం చేసి, స్థల యజమానులకు నోటీసులు యిచ్చి కోడిపందేలు వేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండ లంలోని కవుతరం చాకలిపేటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన చాగంటి పాటి సత్యనా రాయణ పూరిల్లు అగ్నిప్రమాదంలో కాలిపోయింది. ఆస్తి నష్టం కూడా జరిగింది. గుడివాడ అగ్నిమాపక సిబ్బంది మంటలను చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు పడమటి సుజాత బాధిత కుటుంబాన్ని పరామర్శించి బియ్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు పడమటి నాంచారయ్య, ఈడే లక్ష్మి, ఈడే ప్రసాద్ పాల్గొన్నారు.

బాధితులకు రెడ్ క్రాస్ చేయూత : అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన చాగంటిపాటి ఝాన్సీరాణి కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కష్ణాజిల్లా శాఖ సెక్రటరీ భవిరి శంకర్ నాథ్, రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ హరికష్ణ లు తాత్కాలిక నివాసం కొరకు టార్పాలిన్, వంట పాత్రలు సబ్బులు పేస్టులు వాటితో కూడిన హైజెనిక్ కిట్స్ దుప్పట్లు అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి గుడ్లవల్లేరు : స్థానిక ఎస్.ఆర్ జి.ఇ.సి. ఇంజినీరింగ్ కళాశాలలో రెండవ సంవత్సరం ఎంబీఏ చదువుతున్న మచిలీపట్నం కు చెందిన పేద విద్యార్థిని పెదప్రోలు మేఘన కు మచిలీపట్నం మాజీ పార్లమెంటు సభ్యులు బాడిగ రామకష్ణ బాడిగ శేషగిరిరావు రామాయమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కళాశాల ఫీజు నిమిత్తం 20,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. ఈ చెక్ ను శ్రీ కొండలమ్మ అమ్మ వారి ఆలయ అభివద్ధి కమిటీ మాజీ చైర్మన్ బాడిగ నాని ద్వారా మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు , పిన్నమనేని బాబ్జిలు అందచేశారు.

కబడ్డీ విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడివాడ ఎన్టీఆర్ క్రీడాప్రాంగణం వారు ఈ నెల 10 తేదీన సంక్రాంతి సంబరాలు లను గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ మండలాల వారికీ క్రీడా పోటీలు నిర్వహించగా, గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు కబడ్డీలో పలు జట్లతో తలబడి విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన ఎన్.టి.ఆర్.స్టేడియం కమిటీ వైస్ చైర్మన్, జాయింట్ సెక్రటరీ చేతులమీదుగా విజేతలకు ప్రశంస పత్రం, జ్ఞాపికలను అందించారన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను, వారికీ సహకరించిన ఫీజికల్ డైరెక్టర్ వి.శ్రీనివాసరావు, సహాయ ఫీజికల్ డైరెక్టర్ భవదీప్‌లను పాలిటెక్నిక్ యాజమాన్య సభ్యులు చైర్మన్ డా.వల్లూరుపల్లి నాగేశ్వర రావు, సెక్రటరీ, కరెస్పాండెంట్ శ్రీ వి.సత్యనారాయణ రావు, కో - సెక్రటరీ, కరెస్పాండెంట్ శ్రీ వి.రామకష్ణ తదితరులు అభినందించారు..

వక్ఫ్ భూముల సర్వే

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు నగరపంచాయతీలోని 167, 168 సర్వే నంబర్లలో 10.67 ఎకరాల వక్ఫ్ భూములు సర్వేచేసి సరిహద్దులు నిర్ణయించినట్లు మండల తహసీల్దార్ ఎం సురేష్ కుమార్ జిల్లా వక్ఫ్ బోర్డు అధికారులకు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. వక్ఫ్ భూముల ఆక్రమణలపై పీజీఆర్ఎస్లో డిసెంబరు 9న జిల్లాకలెక్టర్ సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ చేసిన ఫిర్యాదుమేర నగరపంచాయతీ సిబ్బంది, జిల్లా వక్ఫ్ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ శాఖ సంయుక్తంగా సర్వే చేశారని, ఎఫ్ఎంబీ లో ఉన్న కొలతల ప్రకారం హద్దులు చూపించినట్టు పేర్కొన్నారు.

వడ్డే ఓబన్నకు ఘన నివాళి

బందరులో నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : నగరంలోని కలెక్టరేట్లో స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలు ఆ శాఖ ఇంచార్జ్ అధికారి ఫణి ధూర్జటి ఇతర అధికారులతో కలిసి వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి తరం స్వాతంత్ర్య సమరయోధుడుగా పేరుగాంచిన వడ్డే ఓబన్న స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సైనిక అధ్యక్షుడిగా పని చేశారన్నారు. రైతులపై బ్రిటీష్ వారు విధించిన పన్నులకు వ్యతిరేకంగా 1845లో వడ్డే ఓబన్న నేతత్వంలో ఉద్యమం కొనసాగిందని, ఈ ఉద్యమంలో వడ్డే ఓబన్న కీలక పాత్ర పోషించారన్నారు.కలెక్టరేట్ పరిపాలన అధికారి సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, వడ్డెర సంఘ నాయకులు , వేముల దుర్గారావు, కొంచెపు రాజేష్, శివరాత్రి నాగరాజు, బత్తుల దుర్గారావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** తొలి స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సి పి రెడ్డి పేర్కొన్నారు. గుడివాడ పట్టణంలోని నెహ్రూ చౌక్ సెంటర్లో ఓబన్న జయంతి వడ్డెర వత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం

గుడివాడలో నివాళులర్పిస్తున్న దృశ్యం

నిర్వహించారు. వడ్డెర వృత్తిదార్ల సంఘం జిల్లా కన్వీనర్ చంద్రగిరి శివ నాగమల్లేశ్వరరావు, సిఐయుటి పట్టణ కార్యదర్శి తమ్మిశెట్టి లక్ష్మణరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి రేపాని కొండ, నాయకులు చల్లా చెన్నారావు, బండి శ్రీను, తమ్మిశెట్టి కుమారు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-కోడూరు** : వడ్డే ఓబన్న 218 వ జయంతిని రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు తిరుపతి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోడూరు మండల బీసీ సంఘం అధ్యక్షులు కొండవీటి సురేష్ పర్యవేక్షణలో స్థానిక ఐదో వార్డ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. వడ్డే ఓబన్న చిత్రపటానికి మహిళలు, వడ్డెర జాతి ప్రజలు, బీసీ సంఘ నేతలు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. మండల బీసీ సంఘం అధ్యక్షులు కొండవీటి సురేష్, వడ్డెర సంక్షేమ సంఘం తిరుపతి శ్రీనివాసరావు, అవనిగడ్డ నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షులు లంకే యుగంధర్ రావుాల్గొన్నారు.

కోడిపందేల బరులు ధ్వంసం

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామంలో ఏర్పాటు చేస్తున్న కోడి పందెల శిబిరాలను కంకిపాడు పోలీస్‌లు, రెవిన్యూ సిబ్బంది ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా కంకిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కంకిపాడు సిఐ హెచ్చరించారు.

అంపాపురంలో టెంట్ల తొలగింపు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలోని అంపాపురంలో కోడిపందాలకు సిద్ధం చేస్తున్న బరులపై పోలీసులు వేటు వేశారు. వీరబల్లి ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది వెళ్లి షామియానా టెంట్లను పీకేశారు. అదేవిధంగా పాకలను నేలమట్టం చేశారు. మొత్తం సామాగ్రిని వాహనాల్లో వేసి స్టేషన్ కు తరలించారు. కోడి పందాల బరులు వేస్తే ఊరుకునేది లేదని ఎస్సై చెప్పారు.

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని కవుతరం,కూరాడ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న జూదపు క్రీడల టెంట్లను తొలగించి పేకాట, కోడి పందాలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ లోకరాజు హెచ్చరించారు. స్థల యజమానులకు, శిబిరం నిర్వహులకు నోటీసులు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ బి లోకరాజు, ఎంపీడీవో టి విజయ సారధి, ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంపాపురంలో టెంట్లు తొలగించిన పోలీసులు

కంకిపాడు మండలంలో టెంట్లు తొలగిస్తున్న దృశ్యం

కార్తీక్‌తో స్మార్ట్ అండ్ హ్యాండ్సమ్ రీబ్రాండింగ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఐకానిక్ మెన్స్ బ్రాండ్ అయిన ఫెయిర్ అండ్ హ్యాండ్సమ్‌కు సరికొత్త గుర్తింపును ఇచ్చేందుకు ఇమామి లిమిటెడ్ నూతన ఉత్పత్తిని స్మార్ట్ అండ్ హ్యాండ్‌సమ్‌గా రీబ్రాండింగ్ చేస్తున్నట్లు సంస్థ ఇన్చార్జి కార్తీక్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. బాలీవుడ్ హార్డ్ త్రోబ్ కార్తీక్ ఆర్యన్ దీనికి కొత్త అంబాసిడర్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. రెండు దశాబ్దాలుగా పురుషుల సౌందర్య సాధనాల మార్కెట్లో బ్రాండ్ నాయకత్వాన్ని ఇది ప్రతిబింబిస్తుందన్నారు. మరింత సమగ్రమైన సౌందర్య పద్ధతుల వైపు సాంస్కృతిక మార్పును ఇది స్వీకరించిందని తెలిపారు. మారుతున్న వినియోగదారుల ప్రాధాన్యతలతో, నేటి యువకులు చర్మ ఆరోగ్యానికి, సంపూర్ణ ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. స్మార్ట్ అండ్ హ్యాండ్సమ్ ఇప్పుడు వారి అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చేందుకు సిద్ధంగా ఉందన్నారు.

సామ్‌సంగ్ విండ్‌ఫ్రీ ఎయిర్ కండీషనర్లు విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ శామ్‌సంగ్ విండ్ ఫ్రీ ఎయిర్ కండిషనర్ విడుదల చేసినట్లు సంస్థ బిజినెస్ హెడ్ ఎం.ప్రతాప్ కుమార్ తెలిపారు. నగరంలోని శామ్‌సంగ్ షోరూంలో జరిగిన కార్యక్రమంలో నూతన ఉత్పత్తులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిద్ర దశల ప్రకారం ఉష్ణోగ్రతను సర్దుబాటు చేయడం ద్వారా రాత్రంతా ఆహ్లాదకరమైన నిద్రను ప్రోత్సహించడానికి సామ్‌సంగ్ 'గుడ్ స్లీప్' మోడ్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. వినియోగదారులు తమ ఎయిర్ కండిషనర్లను వారి గెలాక్సీ వాచ్ సిరీస్‌తో కనెక్ట్ చేయడానికి, వారు నిద్రలోకి జారుకున్నప్పుడు 'గుడ్ స్లీప్' స్వయంచాలకంగా పనిచేయటానికి వీలు కల్పిస్తుందని తెలిపారు. 'గుడ్‌స్లీప్'ను ప్రోత్సహించడానికి, సామ్‌సంగ్ ఒక ప్రత్యేక ఆఫర్‌ను ప్రవేశపెట్టిందని, దీని ద్వారా వినియోగదారులు ఎంపిక చేసిన సామ్‌సంగ్ విండ్‌ఫ్రీ ఎయిర్ కండిషనర్‌లను కొనుగోలు చేయడంపై 42 శాతం వరకు తగ్గింపు పొందొచ్చని ఆయన తెలిపారు.

త్రో బాల్ పోటీల్లో డిఎవి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కేరళలో జరిగిన జాతీయ త్రోబాల్ పోటీల్లో ఎన్‌టిటిపిఎస్ డిఎవి పాఠశాల విద్యార్థులు కాంస్య పతకం సాధించారు. త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు తెనాలిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో గెలిచి, జాతీయ స్థాయికి ఎంపికై కేరళలో జనవరి 3,4,5 తేదీల్లో జరిగిన పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచారు. 9 వ తరగతి విద్యార్థులు పి.పార్థసారథి, సిద్ధార్థ, భావ్యను ఏపీ జెన్ కో సిఇ టి.నాగరాజు, నూతనంగా డిప్యూటీ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన జెన్‌కో పాలకవర్గం సభ్యులు నాగేశ్వరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.మన్మోహన్ అభినందించారు. విద్యార్థుల వెన్నంటే ఉంటూ ఆటలలో తగిన మెలకువలు, సలహాలు, సూచనలు ఇస్తూ ఎప్పటికప్పుడు విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారిని తీర్చి దిద్దుతున్న పాఠశాల పిఇటి బి.మాధవ్‌ని జెన్ కో యాజమాన్యం, డిఎవి యాజమాన్యం అభినందించారు.

రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దీక్షకు మద్దతు

విజయవాడ : పంటల మద్దతు ధర (ఎంఎస్పీ)కి చట్ట బద్ధత కల్పించాలని, రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ గత 45 రోజులుగా శంభూ సరిహద్దుల్లో చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా విజయ వాడ మాచవరం ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ గవర్న మెంట్ కాలేజీ వాకర్స్ అసోసియేషన్ లోని 'రైతు, కౌలు రైతుల సంక్షేమ ఉద్యమ అభిమానులు శనివారం మద్దతుగా పచ్చని మొక్కలను పట్టుకొని మద్దతు తెలిపారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి.నటరాజు మాట్లాడుతూ నవంబర్ 26 నుంచి రైతులు మద్దతు ధర (ఎంఎస్పీ)ని చట్టం చేయాలని చేస్తున్న ఆమరణ దీక్ష 45వ రోజుకు చేరిన సందర్భంగా దల్లేవాల్ ఆరోగ్యం రక్షణ బాధ్యత ప్రధానమంత్రి మోదీ దేనని, రైతులడిమాండ్లు వెంనే అంగీకరించి దీక్షను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. రైతు, కౌలురైతు సంక్షేమ ఉద్యమ అభిమానుల్లో ముఖ్యులు ఎన్.రాజు, వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎల్.జానయ్య, రాఘవులు, కౌలు రైతు సంక్షేమ ఉద్యమ ప్రేమికుల గ్రూపు అధ్యక్షుడు, కె.సుబ్బారావు, జి.అమృతరావు, సిహెచ్.మూర్తి, జె.శ్రీనివాస్, శివాజీ, శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు తెలుపుతున్న దృశ్యం

షా బుఖారిబాబా ఉరుసుకు లక్ష విరాళం

ప్రజాశక్తి - భవానీపురం : ఇబ్రహీంపట్నంలోని బి కాలనీ వద్ద ఉన్న షాబుఖారి బాబా దర్గా ఉరుసు సందర్భంగా ఐజా గ్రూప్ చైర్మన్ షేక్ గయాసుద్దీన్ (ఐజా) ఉరుసు ఉత్సవాల కోసం లక్ష రూపాయల విరాళాన్ని అల్తాఫ్ బాబాకు అందజేశారు. ఈ సందర్భంగా గయాసుద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఏటా షా బుఖారీ బాబా ఉరుసు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. ఎంతో మహిమాన్వితులైన షాబుఖారీ బాబా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు షేక్ ఇస్మాయిల్, అబ్దుల్ మన్నాన్, ఫిరోజ్ ఖాన్, మహబూబ్ ఖాజా, బడాఖాన్ ఫారూఖ్ తదితరులు, ఐజా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష విరాళం ఇస్తున్న గయాసుద్దీన్

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి - ఎ.కొండూరు : పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాడి రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని మండల టిడిపి అధ్యక్షులు గడ్డి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కంభంపాడు ఎ.కొండూరు మాన్సింగ్ తండా చీమలపాడు గ్రామాల్లో ఎపిఎన్ఆర్‌జిఎస్ ద్వారా మంజూరైన గోకులం మినీ షెడ్లను కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎ.కొండూరు మండలంలోని వివిధ గ్రామాల్లోని పాడి రైతులకు 35 మినీ గోకులం షెడ్లు మంజూరు అయ్యాయని వాటిలో 15 షెడ్ల నిర్మాణం పూర్తయ్యిందని చెప్పారు. ఒక్కొక్క గోకులం షెడ్డుకు రూ.2 లక్షల 30 వేలు ప్రభుత్వం మంజూరు చేయగా లబ్ధిదారులు వాటాగా రూ.23 వేలతో ఈ షెడ్ల నిర్మాణం జరిగిందన్నారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతులను అన్ని విధాల ఆదుకుంటామని ఆయన అన్నారు. ఎ.కొండూరు మండల వాసులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న తాగునీటికి కృష్ణా జలాల సరఫరా త్వరలోనే జరుగుతుందని ఎ.కొండూరు వాసుల కలలు జూన్ నెల ఆఖరికి తీరతాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసి కమిటీ చైర్మన్ కటారి కోటేశ్వరరావు మాజీ ఏఎంసీ చైర్మన్ అలవాల రమేష్ రెడ్డి న్యాయంపల్లి రామకష్ణ మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియా వనపర్ల డేవిడ్ రాజు ఎనర్జీ ఎస్ ఎపిఒ రామారావు ఫీల్డ్ అసిస్టెంట్లు పాడి రైతులు టిడిపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

గోకులం మినీ షెడ్లను ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

శారదా విద్యా సంస్థల క్రీడా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నగరంలోని శారద విద్యాసంస్థల క్రీడా దినోత్సవ వేడుకలు శనివారం మొగల్‌రాజ పురంలోని సిద్ధార్థ స్కూల్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులకు పోటీలను నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్, పరుగు పందెంలలో పోటీలను నిర్వహించారు. పోటీలను శారద విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని అన్నారు. క్రీడల వల్ల విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. అలాగే ప్రతిరోజూ ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో సాధన చేసి మంచి క్రీడాకారులుగా ఎదగాలన్నారు. తమ కళాశాల ప్రతి ఏటా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏటా విద్యార్థులకు మాత్రమే క్రీడా పోటీలను నిర్వహించేవారమని , ఈ సారి విద్యార్థులతో పాటు అధ్యాపకులకు కూడా వివిధ క్రీడలలో శిక్షణ ఇస్తున్నామని అన్నారు. అనుభవం, అంకిత భావం కల అధ్యాపకులు వల్లనే మంచి ఫలితాలను సాధిస్తున్నామని అన్నారు. శారద విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై. శారదా దేవి, అడ్వైసర్ ఈ. ఎస్. ఆర్. కె.ప్రసాద్, జనరల్ మేనేజర్ బి. ఎస్.రావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకల్లో యాజమాన్యం, విద్యార్థులు

ఏకలవ్యనగర్లో రోడ్లు పరిశీలన

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక 45వ డివిజన్‌లోని ఏకలవ్య నగర్‌లో రూ.9.5 లక్షల వ్యయంతో పూర్తిచేసిన రెండు సిమెంట్ రోడ్ల పనులను శనివారం 45వ డివిజన్ టిడిపి నాయకులు మైలవరపు కృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా మైలవరపు కృష్ణ మాట్లాడుతూ పశ్చిమ శాసనసభ్యులు వై.సుజనా చౌదరి, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మార్గదర్శకత్వంలో 45వ డివిజన్లో అవసరమైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో ఐదు రోడ్ల నిర్మాణాన్ని పూర్తిచేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ బుచ్చిబాబు, శానిటరీ మేస్త్రి రామిరెడ్డి, కాంట్రాక్టర్ ప్రసాద్, శివ, అబ్రహం, లింగయ్య, అశోక్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను పరిశీలిస్తున్న మైలవరపు కృష్ణ

గోకులాల నిర్మాణంతో ప్రయోజనం

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం నియోజకవర్గంలో 137 గోకులాల నిర్మాణానికిగానూ రూ.2.87 కోట్లు మంజూరు చేసినట్లు స్థానిక ఎంఎల్ఎ వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడించారు. మైలవరం మండలం జంగాలపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నూతనంగా నిర్మాణం పూర్తయిన గోకులాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం మిని గోకులం షెడ్లను మంజూరు చేస్తోందన్నారు. మినీ గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : శ్రీ వెంకటేశ్వర విద్యానికేతన్‌లో 25 సంవత్సరాలు క్రితం చదువుకున్న విద్యార్థులు శనివారం వారు చదువుకున్న పాఠశాలలో కలుసుకొని 25 సంవత్సరాల క్రితం పదో తరగతి తర్వాత శనివారం స్నేహితులు కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆ రోజుల్లో వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం స్కూల్ కరెస్పాండెంట్ నరసింహారావు మాస్టార్ మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, సంపత్, నాగేశ్వరావు, భద్రం, ఎం.నాగేశ్వరావులను, ఎ.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి పెండ్యాలకు చెందిన తుప్పాకుల కేశవరావు, బసవమ్మ రూ.5,116లు, కోనసీమజిల్లా తాపేశ్వరం వాస్తవ్యులు ముత్యాల పద్మ శరణ్య రూ.5వేలు విరాళం ఇచ్చారు. దేవస్థాన వంశపారం పర్యధర్మకర్త, డాక్టర్ విఎల్ ఇందిరాదత్తు, కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.

నేడు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించే జీ తెలుగు ఛానల్‌లో ఈ నెల 12 నుండి సంక్రాంతి సంబరాలు పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చానెల్ ప్రతినిధి కె.రాజశేఖర్ తెలిపారు. నగరంలోని ఛానల్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. పండుగలు , ప్రత్యేక సందర్భాలను జీ తెలుగు వినోద భారత కార్యక్రమాలను అందిస్తుంది అన్నారు. 12 వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు సంక్రాంతి సంబరాలు, ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని అన్నారు. 13 వ తేదీన కూడా ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని అన్నారు.

రామ్ సినిమాస్ ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : గుణదలలోని రాంగోపాల్ థియేటర్ రామ్ థియేటర్‌గా నగరవాసులకు వినోదాన్ని అందించనుందని థియేటర్ అధినేత యలమంచిలి రామ్ తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సరికొత్త సినిమాలతో రామ్ సినిమాస్ నగర వాసులను శనివారం నుంచి అలరించనుందని తెలిపారు. రామ్ సినిమాస్ రెండు స్క్రీన్‌లతో, డిజిటల్ సౌండ్ సిస్టం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. గత 48 సంత్సరాలుగా విజయవాడలో రాంగోపాల్ థియేటర్‌గా అలరించిందని ఇక నుండి రామ్ సినిమాస్‌గా అందరి ముందుకు వస్తుందని అన్నారు. థియేటర్‌లో విశాలమైన కార్ పార్కింగ్‌తో పాటు, స్కూటర్ పార్కింగ్ కూడా ఉందని అన్నారు. టికెట్స్ థియేటర్ తో పాటు బుక్ మై షో ద్వారా ఆన్ లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షులు కెఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో సింగిల్ స్క్రీన్స్ థియేటర్లను కాపాడుకోవడమే నిర్మాతల లక్ష్యమని తెలిపారు. సామాన్య ప్రేక్షకులకు సింగిల్ స్క్రీన్ ద్వారా సినిమాలను తక్కువకే అందిస్తామని వివరించారు. యలమంచిలి రాహుల్, యలమంచిలి రోహన్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యలమంచిలి రామ్

డాక్టర్ సిరిపురపు జ్యోతి సేవలు ఎనలేనివి

• ప్రథమ వర్ధంతి సభలో వక్తలు

జ్యోతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : వైద్యురాలు, సంఘసేవకురాలిగా , మానవతావాది సిరిపురపు జ్యోతి సేవలు ఎనలేనివని రాష్ట్ర విజ్ఞాన కేంద్రాల బాధ్యుడు, ఎంబి విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పిన్నమనేని మురళీ కృష్ణ కొనియాడారు. శనివారం కాటూరులో జ్యోతి ప్రథమ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఎంత సంపాదించినా సంతృప్తి చెందక మరింత సంపాదించాలన్న ప్రస్తుత సమాజంలో తన యావదాస్తిని విజ్ఞాన కేంద్రాల నిర్మాణంతో పాటు చారిటబుల్ ట్రస్టుద్వారా ఎందరికో సహాయం చేయడం ఆమె నిస్వార్ధ సేవకు తార్కాణమన్నారు. ఉయ్యూరులో తన తల్లితండ్రుల పేరుతో విజ్ఞాన కేంద్రం ఏర్పాటుచేసి తద్వారా మహిళలకు కుట్టు, అల్లికలు,కంప్యూటర్ శిక్షణ నివ్వడం,మెగా వైద్య శిబిరాలు నిర్వహించడం సంతోషకర మన్నారు. కోసూరి శివనాగేంద్రం అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ చంద్రశేఖర రావు, డాక్టర్ నీరజ, ట్రెజరర్ కె స్వరూపరాణి, ప్రొఫెసర్ శివ ప్రసాద్ , అరుణకుమారి, పిన్నమనేని చంద్రమోహన్, బాలోత్సవ కమిటీ కన్వీనర్ కె విశ్వమోహన్, అన్నే సుబ్బారావు తదితరులు పాల్గొని జ్యోతి సేవలను కీర్తిం చారు.

చిన్నారులకు భోగి పండ్లతో ఆశీర్వాదాలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వాద కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు కంకిపాడు ఐసిడిఎస్ సూపర్వైజర్ బేబీ సరోజిని భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. అనంతరం బేబీ సరోజినీ మాట్లాడుతూ అనంతరం బేబీ సరోజినీ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటల విద్యను అందించడంతోపాటు సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. పలువురు కార్యకర్తలు చిన్నారుల తల్లిదండ్రులు, గర్భవతులు పాల్గొన్నారు.

కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మహిళల పురోభివృద్ధి, ఆర్థిక అభివృద్ధికి కొల్లు ఫౌండేషన్ ఎప్పుడు అండగా ఉంటుందని కొల్లు ఫౌండేషన్ చైర్ పర్సన్ కొల్లు నీలిమ అన్నారు. మచిలీపట్నం బందావనం థియేటర్ వద్ద గల తెలుగుదేశం పార్టీ కార్యాలయం సమీపంలో కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ముత్యాల ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. వివో సంస్థ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమానికి కొల్లు నీలిమ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందించారు. విజేతగా అరుణ, రన్నరప్ మాధవి లత, రెండో రన్నరప్ స్వప్న సహా విజేతలకు 24 కన్సోలేషన్ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని, ఏ చిన్న సమస్య వచ్చిన ధైర్యంగా ముందుకు నడవాలన్నారు.

ముగ్గులు తిలకిస్తున్న కొల్లు నీలిమ

బహుమతులు సాధించిన విద్యార్థినీలు

గుడ్లవల్లేరు ఫార్మసీ కళాశాల విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసుటికల్ సైన్సెస్ కళాశాల విద్యార్థినులు ఈ నెల 9, 10 తేదీలలో విజయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ మహిళ కళాశాల లో నిర్వహించిన విజయ విబ్రన్జ 2024 సాంస్కృతిక, ఆటల పోటీలలో గుడ్లవల్లేరులో బిఫార్మసీ చదువుతున్న విద్యార్థినులు పాల్గొని ప్రతిభను చూపించారు. ఇందులో భాగంగా చెస్ లో పి. అనూష రెండవ స్థానం, షటిల్ డబుల్ లో యస్. సాయి శతి బందం రెండవ స్థానం , కో-కో- ఏం. జయ శ్రీ బందం రెండవ స్థానం, కబడీ- ఎం. నాగజ్యోతి బందం రెండవ స్థానాలు కైవసం చేసుకున్నారు. పాటలలో-వై. ప్రణతి మొదటి స్థానాన్ని, ఎం. నాగ హరిప్రియ రెండవ స్థానంలో నిలిచారు. నత్య ప్రదర్శనలో- జె. కాంక్ష రెండవ స్థానంలో నిలిచి మొత్తం చాంపియన్ షిప్ ను కైవసం చేసుకొని 11,500 నగదు బహుమతిని గెలుపొందారు. విజయం సాధించిన విద్యార్థినులను ప్రశంసా పత్రాలతో పాటు మొమెంటు ఇచ్చి బహూకరించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఏ. లక్ష్మణ్ రావు, అధ్యాపకులు డాక్టర్. షేక్. అమీనాబి, డాక్టర్. పి. రవీష, డాక్టర్. టి. ప్రశాంతి, డాక్టర్. టి. బాలకష్ణ, తదితరులు అభినందించారు.

మాట్లాడుతున్న నాయకులు

కొనసాగిన కార్మికుల నిరసన

పెనమలూరు : తాడిగడప మున్సిపాలిటీలో తడి పొడి చెత్త సేకరించే వాన్ డ్రైవర్ల సమ్మె రెండో రోజు చేరుకుంది. వేతనాలు చెల్లించాలని కోరుతూ పోరంకిలో మున్సిపల్ కమిషనర్ కార్యాలయం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి పెనమలూరు మండలం సిఐటియు కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ పండగ ముందు జీతాలు వేస్తానని చెప్పి కార్మికులను రోడ్డపాలు చేశారన్నారు. వేతనాలు చెల్లించకుంటే 16 తారీకు నుంచి సమ్మెను ఉధతం చేస్తామని అన్నారు. పెనమలూరు మండలం సిపిఎం కార్యదర్శి ఖాసీం, సిఐటియు పెనమలూరు మండలం నాయకులు మస్తాన్ వలి, తడి పొడి చెత్త వ్యాన్ డ్రైవర్ల సిఐటియు అధ్యక్షులు నేరేళ్ళ, తడి పొడి చెత్త వ్యాన్ డ్రైవర్ల సిఐటియు కార్యదర్శి ఎస్ నరేంద్ర, తడి పొడి చెత్త సంఘం సిఐటియు నాయకులు శ్రీహరి. నరసింహారావు, సూర్యనారాయణ. ఎస్కే మస్తాన్వలి, రవికుమార్. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి-అవనిగడ్డ : వ్యక్తిత్వ మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని, అందుకు గ్రామీణ యువజన వికాస సమితి కషి చేస్తుందని నియోజకవర్గ యువ నాయకులు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండ లి వెంకట్రామ్ తెలిపారు. శనివారం అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో గ్రామీణ యువజన వికాస్ సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల పోటీల్లో భాగంగా కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హై స్కూల్ స్థాయి విద్యార్థులకు కబడ్డీ పోటీలను వెంకట్రాం ప్రారంభించారు. నియోజకవర్గ గ్రామాల్లోని ఆరు మండలాలకు చెందిన 16 పాఠశాలల నుంచి బాలబాలికల కబడ్డీ పోటీలు ప్రారంభము య్యా యి. నియోజకవర్గ ప్రముఖులు శీలం అశ్విని కుమార్, జనసేన జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మట్టి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ సీనియర్ నాయకులు అన్నపురెడ్డి వెంకటస్వామి, టిడిపి మండల అధ్యక్షులు య సం

పోటీలు ప్రారంభిస్తున్న మండలి వెంకట్రాం

చిట్టిబాబు పాల్గొన్నారు.

నేడు దేశభక్తి గేయాల పోటీలు : గాంధీ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు దేశభక్తి గేయాల పోటీలు నిర్వహిస్తున్నట్లు వెంకట రామ్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 9949417719 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

నృత్యపోటీలు ప్రారంభం : సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని గ్రామీణ యువజన వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటలు నత్య పోటీలలో భాగంగా శనివారం సాయంత్రం నత్య పోటీలను టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు.

ఆదిశేషు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

ఆదిశేషు కుటుంబసభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి-మోపిదేవి : నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కషి చేసిన సిపిఎం మోపిదేవి మండల కార్యదర్శి బండి ఆదిశేషు అకాల మరణం పట్ల ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం మోపిదేవిలో ఆదిశేషు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆదిశేష చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కోడూరు రోడ్డు సాధన కోసం పాదయాత్ర చేసిన రోజే ఆదిశేషు మృతిచెందడం చాలా బాధాకరమని ప్రజా సమస్యల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని ఈ సంఘటన తేటతెల్లం చేసిందని విక్కుర్తి పేర్కొన్నారు. పులిగడ్డ చంద్ర తదితరులు వెంట ఉన్నారు.

ఎన్టిఆర్ స్టేడియం క్రీడాకారులకు పతకాలు

ప్రజాశక్తి - గుడివాడ : ఇటీవల మైలవరంలో జరిగిన ఎన్టిఆర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఎన్టిఆర్ స్టేడియం క్రీడాకారులు బంగారు, సిల్వర్తో పాటు పలు పతకాలు సాధించడం అభినందనీయమని స్టేడియ కమిటి ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శిలు యలవర్తి శ్రీనివాసరావు, కిలారపు రంగ ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక ఎన్టిఆర్ స్టేడియంలో పవర్ లిఫ్టింగ్లో పతకాలు సాధించిన గుత్తికొండ లోహిత, నక్క వీరనాగబాబు, జి.సుభాషిని, పి.అనితసత్యదుర్గా, పెద్ది ప్రభుకిరణ్, బోలేం అభిషేక్, తేటకల నరేంద్ర, మరో 6గురు విద్యార్థులు బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు.

జిల్లా స్థాయిలో జరిగిన చెస్ పోటీలలో స్టేడియం విద్యార్థులకు బంగారు పతకాలు

మచిలీపట్నంలో జరిగిన జిల్లాస్థాయి చదరంగం పోటీలలో సిహెచ్ జయప్రకాష్, బి.ప్రవల్లిక, ఎ.మణిశంకర్, ఎ.త్రినాద్, ఎం.భాను, జి.రామ్చరణ్లు వివిధ కేటగిరిలలో బంగారు, సిల్వర్ మెడల్స్, సాధించి స్టేడియం పేరును నిలబెట్టార న్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ మారెళ్ళ వెంకటేశ్వర రావు, స్టేడియం మేనేజర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

దావులూరు టోల్ప్లాజా వద్ద వాహనాల రద్దీ

ప్రజాశక్తి-కంకిపాడు : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కంకిపాడు మండలం దావులూరు టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ నెలకొంది. హైదరాబాద్, చెన్నై, అలాగే బెంగళూరు నుండి తమ సొంత గ్రామాలకు వచ్చే వారితో రద్దీ నెలకొంది. సాధారణ రోజుల్లో మామూలుగా ఉండే విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి శనివారం సాయంత్రం నుండి ఎక్కువ కార్లతో రద్దీ వాతావరణం నెలకొంది.

తాగునీటి సమస్యను వివరిస్తున్న స్థానికులు

తాగునీరందేలా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జి.కొండూరు :
మండలంలోని లోయ ప్రాంతంలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వెంటనే తాగునీరు సరఫరా అయ్యేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని సిపిఎం సీనియర్ నాయకులు మాజీ మండల కార్యదర్శి పంది సాంబశివరావు డిమాండ్ చేస్తున్నారు. 15 రోజులుగా తాగునీరు అందక అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని సిపిఎం నాయకులు శనివారం లోయ ప్రాంతంలో పర్యటించారు. తాగునీరు కొని తాగవలసిన పరిస్థితి ఇక్కడ ఉందని లోయ ప్రాంతంలోని ప్రజలు నాయకులు దృష్టికి తీసుకువచ్చారు. చిన్నపిల్లలు ఉన్నారని ఇక్కడ నీరు కలుషితంగా ఉండటం వల్ల తాగడానికి ఇబ్బందిగా ఉందని అనేక రోగాల బారిన పడుతున్నామని ప్రజలు చెబుతున్నారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ 60 కుటుంబాల వరకు ఈ ప్రాంతంలో నివాస ఉంటున్నారు. 250కి పైగా ఓట్లు ఇక్కడ ఉన్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన ఇక్కడ ప్రజలు మాత్రం తాగునీటికి ఇబ్బంది పడాల్సిందేనని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలోనైనా మంచినీరు అందేలా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పండుగ పూటా పస్తులే...

ప్రజాశక్తి - తిరువూరు :
రేపే సంక్రాంతి పండుగ. కుటుంబ సభ్యుల, బంధువుల మధ్య పిండి వంటలతో సంతోషంగా జరుపుకునే ఈ పండుగ రోజు మాత్రం అంగన్వా డి ఆడపడుచులు పస్తులతో ఉండాల్సిన పరిస్థి తి నెలకొంది. వారు ఏ పాపం చేశారేమో గానీ ప్రభుత్వం నేటికీ జీతాలు ఇవ్వకపోవడంతో మా కు పండగ వేల పస్తులు తప్పేటట్లు లేవని అంగ న్వాడి కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని మినీ అంగన్వాడీ కార్యకర్త లు, ఆయాలకు జీతాలు వేసిన ప్రభుత్వం 1450 మంది ఉన్న మెయిన్ కేంద్రాల అంగన్వాడీ కార్య కర్తలకు నెలకు ఒక్కొక్కరికి రూ.11,500 గౌరవ వేతనం రాలేదు. ఎందుకు ఇంకా తమకు జీతాలు రాలేదని అంగన్వాడీ కార్యకర్తలు ఐసిడీస్ అధి కారులను అడిగితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా (ఆర్ బి ఐ) వద్ద జీతాల బిల్లులు పెండింగ్ లో ఉన్నా యని చెబుతున్నారు. దీనితో ప్రభు త్వోద్యోగులతోపాటే తమకు కూడా వేతనాలు వస్తాయని ఆశించిన వీరికి నిరాశే మిగిలిందని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియ న్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సి హెచ్ సుప్రజ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకటో తారీఖు పోయి పన్నెండో తారీఖు వచ్చినా వేత నాలు పడక ఎదురుచూపులు చూడాల్సి వస్తుం దని, పండుగ వేళ ఇరుగు, పొరుగు కుటుంబాలు పిండి వంటలు చేస్తుంటే అంగన్వా డీ కార్యకర్తల కుటుంబాల్లోని పిల్లలు ఆశగా చూసే పరిస్థితి వస్తున్నదని తెలిపారు. ఉన్నతాధికారులు చొరవ చూపాలని, ప్రభుత్వం నుంచి జీతాలు త్వరగా ఇచ్చి ఆదుకోవాలని సుప్రజా విజ్ఞప్తి చేశారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :
పట్టణంలోని తొర్రగుంటపాలేనికి చెందిన దెందుకూరి సతీష్ 89,519, ఆర్టీసీ కాలనీకి చెందిన ముద్ర శ్రీహరి 50,250, పెనుగంచిప్రోలు మండలం కొనకంచి గ్రామానికి చెందిన బొల్లెపోగు జస్మిక 30,843, జగ్గయ్యపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన తేలుకుంట్ల ఐతరాజు 51,250 సిఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) దయన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు.

సంక్రాంతి సందడి

ఉమ్మడి కృష్ణాజిల్లాల్లో సంక్రాంతి సందడి నెలకొన్నది. తెలుగువారికి అత్యంత పెద్ద పండుగ సంక్రాంతి. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల (సోమ వారం నుంచి బుధవారం) పాటు బంధుమిత్రులతో ఇంటిల్లపాది జరుపుకునే సంక్రాంతి పండగ గ్రామాల్లో, పట్టణాలు, నగరాల్లో ఇప్పటికే హడావుడి బయలు దేరింది. హరిదాసుల గజ్జెల చప్పుళ్ళు, గొబ్బెమ్మలు, రకరకాల రంగవల్లులతో డిశంబర్ మధ్య నుంచి జనవరి 14వ తేదీ వరకు నెల రోజుల పాటు గ్రామాల్లో సంక్రాంతి వాతావరణం కనిపిస్తుంది. పండుగ రోజున చిన్నారులను ఆశీర్వదిస్తూ పెద్దలు భోగి పళ్ల పోస్తారు. తెలుగువారి సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా అత్యంత ఘనంగా, సాంప్రదాయ పద్ధతిలో సంక్రాంతిని జరుపుకుంటున్నారు. ఈ పండుగ వారం రోజుల ముందు నుంచి దూర ప్రాంతాల నుంచి వారి వారి గ్రామాలకు జనం వస్తున్నారు. ఉద్యోగాలు, వివిధ వృత్తులు చేస్తూ ఆయా ప్రాంతాల్లో స్థిరపడిన తెలుగువారు తప్పని సరిగా ఈ పండగకు రావాల్సిందే. ఎక్కువగా హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, ఇతర రాష్ట్రాలతో పాటు అమెరికా, ఇతర దేశాల్లో ఉన్న తెలుగువారందరూ ఉమ్మడి కృష్ణాజిల్లాలోని వారి వారి సొంత గ్రామాలకు తరలి వస్తున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి ఈ రాకపోకల హడావుడి విజయవాడ నగరంలో కనిపిస్తుంది. ముఖ్యంగా గత రెండు రోజుల స్థానిక పిఎన్ బస్‌స్టేషన్‌లో ఈ సందడి, రద్దీ పెరిగిపోయింది. ఐదు రోజుల పాటు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు రావడం, అలాగే కళాశాలలకు, పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో విజయవాడతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులు, విద్యార్థినీ విద్యార్థులు వారి వారి సొంత గ్రామాలకు పయనమయ్యారు. దీంతో విజయవాడ నగరం, ముఖ్యంగా పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ గత మూడు రోజుల నుంచి ప్రయాణికులతో కిక్కిరిసిపోతోంది. ఈ రద్దీ శని వారంతో పాటు ఆదివారం కూడా ఉంటుందని, భోగి రోజు కూడా కొంత వరకు ప్రయాణికుల హడావుడి

7 వీక్షణం

ఉండవచ్చునని ఆర్టీసి అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే పండుగ సీజన్‌లో అంది వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవడం, రాబడిని రాబట్టుకోవడంలో ఎపిఎస్ఆర్‌టిసి అనుకున్నంత మేరకు లక్ష్యాన్ని సాధించలేకపోతున్నట్లు స్వయంగా ఆర్టీసిలోని ఉద్యోగ, కార్మికులు వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతినాడు ఆర్టీసి సర్వీసుల పరిస్థితిపై స్వయంగా రాష్ట్రముఖ్యమంత్రి చేసిన ప్రకటన ద్వారా దాని లోటు పాట్లు విదితం చేస్తున్నాయి. ప్రయాణికుల రద్దీని అధిగమించడానికి పండుగ రోజుల్లో స్కూల్స్ వ్యాన్లు, బస్సులను ఉపయోగించి గ్రామాలకు ప్రయాణికులను తరలించాలని స్వయంగా సిఎం చంద్రబాబు శనివారం వెల్లడించిన ప్రకటన, ప్రయాణికులకు ఆర్టీసి సర్వీసులను, వారి సేవలను పూర్తి స్థాయిలో అందించడంలో విఫలం చెందిందని, ఆస్థాయిలో సర్వీసులు లేవని ఆయన చెప్పకనే చెప్పినట్లుగా ఉంది. ఫిట్‌నెస్ లేని అత్యధిక స్కూల్స్ వ్యాన్లు, బస్సుల్లో, అనుభవం లేని డ్రైవర్లతో ప్రయాణించే సమయంలో జరగరానికి ఏదైనా జరిగితే దానికి బాధ్యులు ఎవరని సగటు ప్రయాణికుడు వ్యక్తం చేస్తున్నారు. సిద్ధార్థ కళాశాలలో సంక్రాంతిని పురస్కరించుకొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక ఎంబివికె, ఫోరంఫర్ ఆర్టిస్ట్స్ నేతృత్వంలో బొమ్మల కొలువు ప్రదర్శన శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. చిన్నారులకు భోగిపళ్లు పోసి, వారిని పలువురు ప్రముఖులు ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ పి తేజస్వి ముఖ్యఅతిధులుగా విచ్చేశారు. ఇదే రీతిలో ఇతర అనేక సంస్థలు సంక్రాంతి సంబరాలను వివిధ రూపాల్లో నిర్వహిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా బట్టలషాపులు, వివిధ రకాల సరుకుల దుకాణాలు, బంగారుషాపులు విక్రయాలతో వాటిల్లో రద్దీ ఏర్పడింది. అయితే మరో వైపున సంక్రాంతి కళ తప్పింది. గ్రామాల్లో, పట్టణాల్లో పెరిగిన ధరలు, తగిన రాబడి లేక పేద వర్గాలు పండుగ చేసుకోవడానికి చేతిలో పైసలు లేక దూరంగా ఉండక తప్పడం లేదు. ఆయా రంగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులు, రోజువారీ కార్మికులు, ఇతర వృత్తుల్లోని కార్మికులకు సరైన పని లేక, పెరిగిన ధరలకనుగుణంగా రాబడి లేక పండుగ చేసుకుందామన్నా తగిన ఆర్థిక పరిస్థితి లేక వారి వారి ఇళ్లల్లో పండుగ హడావుడి అంతగా కనిపించని వాతావరణం నెలకొన్నది. హైకోర్టు ఆదేశాలు, రెండు జిల్లాల కలెక్టర్ల ఆదేశాలను సైతం లెక్కచేయకుండా గ్రామాల్లో పెద్ద ఎత్తున కోడి పందాలు జోరు ఊపందుకుంది. కోడిపందాల్లో లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. ఎన్ని పత్రికలు, ఆంక్షలు ఎదురయినా ప్రభుత్వంలోని పెద్దల అండతోనే ఈ పందాలు ప్రతి ఏటా జరుగుతున్న విషయం ప్రతి ఒక్కరికీ తెలిసిందే.

వివిహెచ్ఆర్ -

ఇబ్రహీంపట్నంలో భోగి మంట వద్ద సందడి

పలుచోట్ల సంబరాలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి క్రాంతి హైస్కూల్లో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో పాఠశాలకు హాజరై ఉత్సాహంగా సంబరాల్లో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎల్ కేజీ విద్యార్థులకు భోగి పళ్ళ కార్యక్రమం రంగవల్లులు, బొమ్మలకొలువు, కోలాటం, గాలిపటాలు ఎగరవేయడం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరెస్పాండెంట్ వెనిగళ్ళ మురళి మోహన్ తెలిపారు.
వన్‌టౌన్ : ముచ్చటైన ముగ్గులు, సరదా గాలిపటాలు, ఉత్సాహంగా సాగే కోలాట ప్రదర్శనలతో విద్యార్థులు సందడి చేశారు. వాసవి క్లబ్, యుజిసి ఉమెన్ స్టడీస్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యాన కెబిఎన్ కళాశాలలో సంక్రాంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.
మైలవరం : స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మైలవరం పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సంప్రదాయ సంక్రాంతి' క్రీడా పోటీలను సిఐ డి.చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు.
కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల సమీపం లోని అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. రంగవల్లులు, గాలి పటాల పోటీలు నిర్వహించారు. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దు విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె . రామ మోహన రావు మాట్లాడుతూ మన పండుగలు - మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని, ఈ సంక్రాంతి కి ప్రతి ఇల్లు ధన, ధాన్యాలతో , భోగ భాగ్యాలతో కళ కళ లా డుతూ ఉంటుందని తెలియ చేశారు. అందరికి సంక్రాంతి శు భాకాంక్షలు తెలియచేసారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శశిధర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటే అందరికి గుర్తుకు వచ్చేది రంగ వల్లులు , గాలి పటాలు, గంగిరెద్దుల వారు, హరి దాసులు అని , ప్రతి ఇంటిని, పశువులను అలంకరించటం జరుగుతుందని తెలిపారు. ఈ తరం విద్యార్థులు పండుగ యొక్క ప్రాముఖ్యతను తెలుసుకోవాలని, ఈ పోటీ ప్రపంచం లో మంచి ప్రణాళిక తో కష్టపడి చదివితే విజయం సాధించవచ్చునని తెలిపారు. కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యం లో కళాశాల విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు, విద్యార్థులకు గాలి పటాల పోటీలు నిర్వహించి పోటీలో గెలుపొందిన వారికి కళాశాల యాజమాన్యం తరుపున ప్రశంసా పత్రాలు, మెమెంటోలు, బహుమతులు అందచేశారు. కళాశాల లో ఏర్పాటు చేసిన కోలాటం, రంగవల్లులు, బొమ్మల కొలువు, గంగిరెద్దుల (డూ డూ బసవన్న) వారితో కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా జరిగింది. కళాశాల విద్యార్థులు నిర్వహించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణ గా నిలిచింది. ముగ్గుల పోటీలో ప్రథమ బహుమతి బి.టెక్ మూడవ సంవత్సరం చదువుతున్న టి . సాయి చందన మరియు యు.స్వాతి లు, గాలి పటాల పోటీల్లో ప్రథమ బహుమతి బి.టెక్ రెండవ సంవత్సరం చదువుతున్న జి.పవన్ మరియు మోహన్ లు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **తిరువూరు :** ప్రతిభ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు జరిగాయి ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - వీరులపాడు : వీరులపాడు మండలం జుజ్జూరులో ఆనాటి ప్రభుత్వ పాఠశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం అపూర్వంగా నిర్వహించారు. 1983-84 సంవత్సరంలో గ్రామ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఒక చోట కలవడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఉద్యోగాలు వ్యాపారాలు రీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వీరు చిన్ననాటి మిత్రులను చూసి భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని సెల్ఫీలు, ఫొటోలు దిగారు. ఒకరినొకరు అడ్రస్‌లు తీసుకొని, చేస్తున్న పని, కుటుంబ సభ్యుల వివరాలు, యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాడు తరగతి గదులు చేసిన అల్లరి, చిలిపి పనులను గుర్తుకు తెచ్చుకొని కులాసాగా గడిపారు. అనంతరం నృత్య ప్రదర్శన చేశారు. ఆనాటి కాలంలో విద్య బుద్ధులను నేర్పిన ఉపాధ్యాయులకు ప్రతి విద్యార్థి

పాదాభివందనం చేసి వారిని దుశ్శాలతో ఘనంగా సత్కరించారు. ఆనాటి ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు సహపంక్తి భోజనం చేశారు. ఆనాటి ఉపాధ్యాయులు మేడికొండూరు నందకుమార్, జిల్లేపల్లి స్వామి, మద్దూరి సోమయాజులు, షేక్ నాగులు, సరి మళ్ల సుధారాణి, అరికట్ల వెంకటేశ్వరరావు, వేమిరెడ్డి నాగిరెడ్డి, నరాల రమణారెడ్డి,వేముల వెంకటనారాయణ తేళ్లూరి లక్ష్మీ నర్సమ్మ మొగులూరు ప్రభావతి షేక్ రహ్మాన్ పాల్గొన్నారు

పుంజా... పోలీసా....!

ప్రజాశక్తి - వత్సవాయి : కోడిపందేలకు అనుమతి లేదంటూ అధికారులు కోడైకూస్తున్నా ఇవన్నీ మామూలే అంటూ ముందుకు సాగిపోతూ బరులు సిద్ధం చేసుకుం టున్నారు నిర్వాహకులు. అధికారులు ఎన్ని ప్రకటనలు చేసి ఆదేశాలిచ్చినా ప్రభుత్వాలు ఎన్ని మారినా, సంక్రాంతి పండగ అంటే కత్తులు కట్టి కోడి పందేలు నిర్వహిస్తాం అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు కొందరు. గుండాట, పేకాట, లోపల బయట, వంటి జూద క్రీడలు నిర్వహిం చి ప్రజల డబ్బును దోచేస్తాం. నోరులేని కోళ్లకు కత్తులు కట్టి అవి పొడుచుకొని చచ్చిపోతుంటే వికృత క్రీడను వీక్షించి డబ్బు సంపాదిస్తాం అంటున్నారు. పండగ మూడు రోజులు ఏ అధికారులు ఫోన్లకు అందుబాటులో ఉండరని అంతా ఒక పద్ధతి ప్రకారం జరిగిపోతుందని మరికొందరు చెప్పుకొస్తుంటే కొందరు ముక్కున వేలేసుకుంటున్నారు.

పశుసంపద అభివృద్ధికి గోకులం షెడ్లు దోహదం

- మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : జిల్లాలో పశు సంపద అభివద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, పశువులు కలిగిన లబ్ధిదారులకు మినీ గోకులం షెడ్లు నిర్మిస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మచిలీపట్నం మండలం అరిసెపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన మినీ గోకులం షెడ్డును మంత్రి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరు పశువులు కలిగిన లబ్ధిదారునికి మినీ గోకులం షెడ్డు నిర్మాణానికి రూ. 2.3 లక్షలు, 4 పశువుల షెడ్డు నిర్మాణానికి రూ. 1.85 లక్షలు, 2 పశువుల షెడ్డు నిర్మాణానికి రూ. 1.15 లక్షలు, అదేవిధంగా 50 గొర్రెలు కలిగిన లబ్ధిదారులకు రూ. 2.30 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మినీ గోకులం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కింద జిల్లా వ్యాప్తంగా 25 మండలాల్లో దాదాపు 1,0081 మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు బండి రామకష్ణ, కుంచె నాని, తలారి సోమశేఖర్, డ్వామా పీడీ కేవీ శివప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** బాపులపాడు మండలం అంపాపురం గ్రామములో నిర్మించిన గోకులం షెడ్లను, ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలో నిర్మించిన ఒక షెడ్డును గన్నవరం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. ఉంగుటూరు మండల ఎంపీడీవో ఈ సత్య కుమార్, బాపులపాడు మండల ఎంపీడీవో జోగేశ్వరరావు, మూల్పూరి సాయి కళ్యాణి, ఆళ్ల వెంకట గోపాలకష్ణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** చల్లపల్లి మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ శివారు చింతలమడ, నూకలవారిపాలెం గ్రామాల్లో మినీ గోకులాలు శనివారం చల్లపల్లి మండల ఎంపీపీ కోట విజయ రాధిక ప్రారంభించారు. లక్ష్మీపురం - 3 యంపీటీసీ సభ్యులు మాలేంపాటి శ్రీనివాసరావు , లక్ష్మీపురం పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ దాసరి సురేష్, జనసేన పార్టీ చల్లపల్లి టౌన్ అధ్యక్షులు బొందలపాటి వీరబాబు పాల్గొన్నారు.. **ప్రజాశక్తి - గుడివాడ :** గుడివాడ, నందివాడ మండలాల్లో రూ.1.50 కోట్లతో 66 గోకులం షెడ్లు నిర్మాణ దశల్లో ఉన్నాయని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ రూరల్ మండలం లింగవరం, నందివాడ మండలం చిన లింగాల గ్రామాల్లో మినీ గోకులం షెడ్డులను ఎమ్మెల్యే ప్రారంభించారు. మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, టిడిపి నాయకులుచిరంజీవి రెడ్డి, మందపాటి గోపాలస్వామి, గాదిరెడ్డి చిన్నబాబు, గాదిరెడ్డి మనోహర్, తోట మురళి పాల్గొన్నారు.

గోకులం షెడ్డు ప్రారంభించిన మంత్రి కొల్లు

సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : స్థానిక పటమటలంక సి పి ఎం కార్యాలయంలో కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు విజయవాడ తూర్పు నగర విస్తతస్థాయి సమావేశం శనివారం జరిగింది ఈ సమావేశానికి నగర నాయకులు వి . బి.రాజు అధ్యక్షత వహించారు ఎన్టీఆర్ జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్. సి. హెచ్ శ్రీనివాస్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు పాల్గొన్నారు . ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అసంఘటిత నిర్మాణ కార్మికులు, వివిధ రంగాల కార్మికుల పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులని విస్మరిస్తున్న యని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు దేశవ్యాప్తంగా అమలులో ఉంటే మన రాష్ట్రంలో మాత్రం ఐదు సంవత్సరాల ఏడు నెలలుగా సంక్షేమ బోర్డు ఉపయోగంలో లేకుండా చేశారని అన్నారు .కూటమి ప్రభుత్వం 7నెలలు పూర్తవుతున్న ఎన్నికల హామీ లని అమలు చేయా లేకపోతున్నాయని, తెలిపారు .1214 సర్క్యులర్ ని రద్దు చేసి సంక్షేమ బోర్డుని వెంటనే పున ప్రారంభించాలని, బిల్డింగ్ మెటీరియల్ ధరలు ప్రభుత్వ ఆధీనంలో తీసుకువచ్చి ఇసుకను అందుబాటులోకి తెచ్చి చిన్న మధ్య బిల్డింగ్ సముదాయాలు నిర్మించే వారిని ఆదుకోవాలని ,అన్నారు. బిల్డింగ్ మెటీరియల్ ధరలు తగ్గించి తద్వారా నిర్మాణ కార్మికులను ఉపాధి కల్పించే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో భాగంగా కార్పెంటర్స్, పెయింటర్స్, మార్బుల్, తాపీ వర్కర్స్, ముఠావర్కర్స్ మొదలగు వత్తి కమిటీ సభ్యులు , సనకా వేణుగోపాలకష్ణ ,పటాన్ కరిముల్లా,మాజేటి మల్లేశ్వరరావు, ఇర్ఫాన్, కిరణ్, విజయ్ కుమార్, పొనమాల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గంలోని 13 మంది లబ్ధిదారులకు 12,88,158 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అందజేశారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఈ సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలో 95 మందికి రూ 74, 01,925 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్ రామ్, కూటమి నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు

వివేకానందకు నివాళి

ప్రజాశక్తి విస్సన్నపేట : స్థానిక శ్రీ శ్రీ స్మార్ట్ స్కూల్‌లో నందు జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానందుని జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పాఠశాల నిర్వాహకులు రాజేశ్వర్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ అభ్యున్నతి అంతా కూడా యువత చేతిలోనే ఉందని, యువత ,విద్యార్థిని విద్యార్థులు దేశ అభివద్ధిలో పాలుపంచుకొని వివేకానందుని ఆశయ సాధనకు పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర ప్రసాద్ , పూర్ణచంద్రారెడ్డి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బోట్ల శివ సత్య నారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వంటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ : సంక్రాంతి సంబరాల్లో భాగంగా అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని బందలాయి చెరువు గ్రామంలో వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జనసేన పార్టీ నాయకులు కమ్మిలి సాంబశివరావు గ్రామ్ పార్టీ అధ్యక్షులు కమ్మిలి మారిబాబుల ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం గ్రామస్థాయిలో పోటీలు నిర్వహించగా మహిళలు బాలికలు వద్ధ మహిళలు పాల్గొని వివిధ రకాల వంటలను ప్రదర్శించారు. కమ్మిలి సాంబశివరావు దంపతులు కమ్మిలి మారిబాబు దంపతులు న్యాయ నిర్ణేతలుగా విజేతలను ఎంపిక చేశారు.

ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి

ప్రజాశక్తి చల్లపల్లి : రాష్ట్రంలో విద్యుత్ వినియోగ దారులపై సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో అధిక భారాలు మోపి వసూలు చేయటం ప్రభుత్వం దుర్మార్గపు చర్య అని మొవ్వ మండల సిపిఎంకార్యదర్శి శీలం నారాయణరావు అన్నారు. శనివారం మొవ్వలో ఆయన మాట్లాడుతూ పెంచిన విద్యుత్తు తగ్గించాలని ట్రూ ఆప్ చార్జీలను రద్దు చేయాలని, సర్దుబాటు చార్జీలను ప్రభుత్వమే భరించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, గత ప్రభుత్వం ఆదానీ దగ్గర సోలార్ విద్యుత్ ఒప్పందాలు పేరుతో తీసుకున్న లంచాలపై విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 13వ తేదీ భోగిమంటల్లో ప్రజలందరూ విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో దహనం చేయాలనే చేపట్టిన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

అలాగే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు మరచి, అధికారం చేపట్టిన అనంతరం విద్యుత్ చార్జీలు పెంచి, ట్రూ అప్ చార్జీ పేరుతో అదనపు బారాలు వేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు ధ్వజమెత్తారు. మండల పరిధిలోని నడకుదురులో శనివారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ భోగి రోజున పెరిగిన విద్యుత్ పిల్లలను భోగి మంటల్లో దహనం చేయాలని విద్యుత్ వినియోగదారులను సూచించారు. సిపిఎం మండల సభ్యులు కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా, కుంపటి బాబురావు, మేడేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

కూడేరు గ్రామాభివృద్ధికి కృషి : సర్పంచ్

ప్రజాశక్తి-పమిడిముక్కల : కూడేరు గ్రామ అభివద్ధికి కృషి చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ వీర్ల నాగరాజు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్ని గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నా యన్నారు. కూడేరు గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సారథ్యంలో పూర్తిచేశామని అన్నారు. అలాగే తాగునీటితోపాటు ఇతర మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. పమిడిముక్కల మండలంలో కూడేరు గ్రామాన్ని ఒక మోడల్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు.

పలుచోట్ల సంక్రాంతి సంబరాలు

ఉయ్యూరులోని ఏజీఅండ్ఎస్ జి ఎస్ కళాశాలలో...

గుడివాడలోని వికాస్ రెయిన్ బోలో...

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఏజీఅండ్ఎస్ జి ఎస్ కళాశాల తెలుగు శాఖ, సాంస్కృతిక విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా భోగి మంటలు, బొమ్మల కొలువు, హరిదాసు ప్రదర్శన, రంగవల్లులు, విద్యార్థుల సాంప్రదా య దుస్తులు అందరిని అలరించాయి. ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె సాంబశివరావు, నూకల సాంబశివరావు, కళాశాల ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధి కారి సత్యనారాయణ, అధ్యాపకులు ఎంఎల్ఎస్ కుమారి, కిరణ్మయి, అపర్ణ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

వికాస్ రెయిన్‌బో స్కూల్‌లోసంక్రాతి సంబరాలు

ప్రజాశక్తి - గుడివాడ : వికాస్ రెయిన్‌బో స్కూలులో సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం సాంప్రదాయక ఆటల పోటీలు నిర్వహించారు. వికాస్ రెయిన్‌బో స్కూలులో విద్యార్థులు రంగు రంగుల రంగువల్లులు, సంక్రాంతి పాటలు పాడి, భోగి మంటలు, గంగిరెద్దుల సన్నాయి, కోడి పందాలు, వాయిద్యాలు, ముత్యాల ముగ్గులు, గుమ్మడిపూలు, గొబ్బిళ్ళు, చిన్నారుల ఆనందోత్సాహాలు, చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణల మధ్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ పి.రామచంద్రశేఖర్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

క్రాంతి కళాశాలలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : క్రాంతి జూనియర్, డిగ్రీ కాలేజ్ లో సంక్రాంతి సంబరాలు కళాశాల కరస్పాండెంట్ దుట్టా శివరామ ప్రసాద్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి చల్లపల్లి సిఐ ఈశ్వరరావు మాట్లాడారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కళాశాలలో ముగ్గుల పోటీలను, గంగిరెద్దుల విన్యాసాలను, పొట్టేళ్ల పోటీలు,ఆటల పోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల విద్యార్థులు సోది చెప్పడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పోటీల్లో విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వికెఆర్ కళాశాలలో...

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి గ్రామ పరిధిలోని వి. కే. ఆర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు భోగిమంటలు వేశారు. పాటలతో, నత్యాలతో సందడి గావించారు. పాల పొంగళ్ళు చేశారు. గొబ్బియల్లో గొబ్బియల్లో అంటూ ఆడ పిల్లలు చిందేశారు. ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు, అధ్యాపకులు నవీన్ పర్యవేక్షించారు.

గన్నవరంలోని వికెఆర్ కళాశాలలో...

జి.కొండూరులో

కోడి పందేల బరులు ధ్వంసం

ప్రజాశక్తి - జి.కొండూరు : సంక్రాంతి పండుగకు కోడి పందేలు నిర్వహిం చేందుకు భారీ ఎత్తున బరులు సిద్ధం చేశారు పందెం రాయుళ్లు, పేకాట, గుండాట కోసం నిర్వహించేందుకు క్రికెట్ స్టేడియం తరహాలో బిరులను ఏర్పాటు చేశారు. జి కొండూరు మండల పరిధిలోని మునగపాడు, కట్టుబడిపాలెం, కోడూరు వంటి ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన బరులను మండల తహాశీల్దార్ చాట్ల వెంకటేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపి జి.కొండూరు ఎస్‌ఐ సతీష్ కుమార్‌తో కలిసి ధ్వంసం చేశారు. ఎవరైనా మండల పరిధిలో చట్ట వ్యతిరేకమైన కోడిపందాలు, బరులను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. **కంచికచర్ల :** సంక్రాంతి పండుగ పురస్కరించుకొని కోడిపందేలు, పేకాట లాంటి జూదాల నిర్వహణకు ఏర్పాటు చేసిన బరులను పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి శనివారం ధ్వంసం చేశారు. కోడి పందెలు నిర్వహించిన, జూదం అడిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వారం రోజులు నుంచి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ పోలీసులు హెచ్చరికలను బేఖాతర్ చేస్తు కంచికచర్ల మండల పరిధిలోని గండేపల్లి గ్రామంలో కోడి పందేలు నిర్వహించేందుకు బరులు సిద్ధం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ బోనగిరి రాజు, డిప్యూటీ తహాశీల్దార్ మానస రెవెన్యూ అధికారులు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని కోడి పందెల నిర్వహణకు సిద్ధం చేసిన బరిని ధ్వంసం చేశారు. కర్రతో తయారు చేసిన జల్లలు, కర్రలు ఇతర సామాగ్రిని ధ్వంసం చేశారు. బరి ఏర్పాటు చేసిన భూమి యజమానితో పాటు కోడి పందేల నిర్వాహణకు బరి ఏర్పాటు చేసిన నిర్వాహకుడికి నోటీసు జారీ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కంచికచర్లలో

మనిషిని మేల్కొల్పేదే అసలైన కవిత్వం

'తల్లడిల్లే తల్లి వేరు' పుస్తకావిష్కరణలో సినీగేయ రచయిత రసరాజు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మనిషిని మేల్కొల్పేదే అసలైన కవిత్వమని సుప్రసిద్ధ సినీ గేయ రచయిత రసరాజు అన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న 35వ పుస్తక మహోత్సవంలో శనివారం చెరుకూరి రామోజీరావు సాహిత్యవేదికపై మొదటి కార్యక్రమంగా నవ మల్లెతీగ మాసపత్రిక నిర్వహణలో సరికొండ నరసింహారాజు కవితా సంపుటి "తల్లడిల్లే తల్లి వేరు"ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రసరాజు మాట్లాడుతూ కవి ఒక వాక్యానికి జన్మనిచ్చేందుచేందుకు పునర్జన్మనెత్తుతాడన్నారు. పుస్తకాన్ని సమీక్షిస్తూ డాక్టర్ గుమ్మా సాంబశివరావు... నరసింహారాజు తన కవిత్వంలో తెలుగు భాషలో కొన్ని కొత్త పదబంధాలను కని పెట్టారన్నారు. సభాధ్యక్షులు ఘంటా విజయ్ కుమార్ మాట్లాడుతూ... ఆధుని కవిత్వంలో సరికొండ ఒక కొత్త వాక్యం అన్నారు. విప్లవ రచయితల సంఘం (విరసం) రాష్ట్ర అధ్యక్షులు అరసవిల్లి కష్ణ మాట్లాడుతూ.. నరసింహారాజున తన కవిత్వంతో సమాజంలో ఒక అరుణ పతాకం ఎగరేసారన్నారు. సమాజంలోని తాజా పరిణామాల పట్ల అసంతప్తిని ఆకట్టుకునేలా కవిత్వ వాక్యాల ద్వారా వెల్లడించడం ప్రశంసనీయమన్నారు. మానవీయ సంవేదన కలిగి ఉన్న కవులకు మాత్రమే అది సాధ్యమన్నారు. కార్యక్రమంలో పోలవరపు సాంస్కతిక సమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణరావు, రిటైర్డ్ తహాశీల్దార్ కూరపాటి కోటంరాజు, మల్లెతీగ కలిమిశ్రీ పాల్గొన్నారు. కవి స్పందన తెలియజేస్తూ సరికొండ నరసింహారాజు అందరికీ కతజ్ఞతలు తెలిపారు. కవి నరసింహారాజు వందన సమర్పణ చేశారు.

పుస్తక మహోత్సవంలో నేడు

మధ్యాహ్నం 12గంటల నుంచే సందర్శకులను ప్రాగంణంలోకి అనుమతిస్తారు. ప్రదర్శనకు ఆఖరి రోజు కనుక పుస్తకప్రియుల సౌకర్యం కోసం ఈ ఏర్పాటు చేస్తున్నట్లు పుస్తకమహోత్సవ సంఘం అధ్యక్షులు కె.లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

పలు పుస్తకాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వేల సంవత్సరాల క్రితం నుండే ఉన్న వేదాలు నేటికీ చర్చనీయాంశాలేనని డాక్టర్ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు అన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న 35వ పుస్తక మహోత్సవంలో శనివారం రామోజీరావు సాహిత్యవేదికపై విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. రుగ్వేద 'యథార్ధ దర్శనం', 'వెలుతురు', 'స్వప్నసాగరం', 'ఈ గులాబీకి ముళ్ళు లేవు' పుస్తకాలను రెంటాల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదాలు అపౌరుషేయాలు కానప్పటికీ వాటిలోని సౌందర్యాన్నీ, ప్రకతికి సంబంధించిన అవగాహననూ కాదనలేమన్నారు. సమాజశాస్త్ర అధ్యయనానికి కావాల్సిన సమాచారమంతా పుష్కలంగా ఉందన్నారు. నేడు పూజిస్తున్న దేవతలెవరూ వేదాలలో లేరన్నారు. వేదాలు అధ్యయనం చేస్తున్నవారిలో, గౌరవిస్తున్నవారిలో చాలామందికి వాటికి అర్థం తెలియదన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త, లయోల కళాశాల పూర్వ అధ్యాపకులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు 'వెలుతురు' పుస్తకాన్ని సమీక్షించారు. విశ్రాంత ఐఎయస్ అధికారి ఎండీ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ కథా సౌందర్యానికి సంబంధించిన నియమాలను వివరిస్తూ, రసరాజుగారి కథాసంపుటిలో ఆ లక్షణాలున్నాయన్నారు. కవి, రచయిత రసరాజు మాట్లాడుతూ తన కథా సంపుటిలోని కథల విశేషాలను వర్ణించారు. డాక్టర్ గుజ్జు చెన్నారెడ్డి మాట్లాడుతూ ఆంగ్ల సాహిత్య వికాసక్రమాన్ని వివరించారు. స్వప్నసాగరం అనేది భారతదేశంలోనే మధ్యమపురుష (ద్వితీయపురుష)లోనే రాసిన మొదటి రచన అన్నారు. డాక్టర్ తాటి శ్రీకష్ణ మాట్లాడుతూ సాహితీకారులు ఎల్లప్పుడూ వారి కాలం నాటి బాధితుల స్వరాన్ని ప్రతిఫలించాలన్నారు. విశాలాంధ్ర మేనేజరు మనోహర్ నాయుడు వందన సమర్పణ చేశారు.

కాశ్మీర్ జలకన్య ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - భవానీపురం : నగరంలో విద్యాధరపురం గ్రౌండ్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కాశ్మీర్ జలకన్య ఎక్స్‌పో 2025ను శనివారం సాయంత్రం విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. పిల్లలకు విజ్ఞానాన్ని కల్పించేలా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆయన నిర్వాకులకు సూచించారు. అనంతరం ఎగ్జిబిషన్లో ఏర్పాటుచేసిన కాశ్మీర్ అందాలతో పాటు జలకన్యల అద్భుత విన్యాసాలను తిలకించి ఔరా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ సీ.ఎం. చంద్రబాబు పశ్చిమ నియోజకవర్గంలో మెగా డ్రోన్ షో, సీప్ లైన్‌ను వంటి కార్యక్రమాలు ప్రారంభించి పశ్చిమ నియోజకవర్గానికి వన్నె తెచ్చారని అన్నారు. అటువంటి పశ్చిమ నియోజకవర్గంలో అత్యద్భుతమైన ఎగ్జిబిషన్లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ ఎగ్జిబిషన్ కాశ్మీర్ సోయగాలతో పాటు గుహల సౌందర్యాన్ని కళ్ళకు కట్టిన విధంగా అబ్బుర పరుస్తుందని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ చిన్న పెద్ద తేడా లేకుండా కనువిందు చేస్తుందని తెలిపారు. అనంతరం టిడిపి నాయకులు నాగుల్ మీరా, కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి మాట్లాడుతూ ఎగ్జిబిషన్ ప్రతి ఒక్కరిని ఆహ్లాదపరుస్తుందని, ప్రతి ఒక్కరు ఎగ్జిబిషన్ వీక్షించి ఆనందించాలని అన్నారు. నిర్వాహకులు రాజా రెడ్డి, కోటి రెడ్డి, షన్మి ఖాన్, అడపా ప్రభాకర్ తదితరులు మాట్లాడారు. జెయింట్ వీల్, కొలంబస్, టోరాటోరా, బ్రేక్ డ్యాన్స్, చిన్న పిల్లల ఆటవస్తువులు ఈ ఎగ్జిబి షన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ ఇటు చిన్నారులు, అటు పెద్దవారికి ఆహ్లాదంతో పాటూ ఆనం దాన్ని పంచు తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. నగర వాసు లు తప్పక ఎగ్జిబిషన్ ను సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పాల్గొన్నారు.

క్రెడాయి బంగారు లక్ష్మి ఆఫర్‌లో బంగారం అందజేత

విజయవాడ : క్రెడాయ్ 10వ ప్రాపర్టీ షోకు సందర్శకులు భారీగా వచ్చి సందర్శించారు. వారిలో జి.నాగేశ్వరరావు, స్వర్ణ ప్రాపర్టీ షోను సందర్శించి స్టాల్స్‌లో పివిఆర్ భవిష్యహిల్స్ కొలనుకొండ, తాడేపల్లి ప్రాజెక్ట్ వివరాలు తెలుసుకొని విల్లా కొనుగోలు చేశారు. పివిఆర్ భవిష్యహిల్స్ ప్రాజెక్ట్ తరపున కోగంటి రమేష్ అంకినీడు, దాసరి రాంబాబు, తుమ్మల వంశీ కృష్ణ వారికి క్రెడాయి బంగారు లక్ష్మి ఆఫర్‌లో 2 కాసుల బంగారం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయి సెక్రటరీ వరదా శ్రీధర్, షేక్ రజా, తమిరి శశాంక్ పాల్గొన్నారు.

బంగారం అందజేస్తున్న దృశ్యం

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : (బిఎన్‌కెయు) భారతీయ నవీన క్రీడా ఉత్సవ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఎస్.ఎల్.వి గ్రూప్ కో-స్పాన్సర్‌గా నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న చెస్ పోటీలు ఉత్సాహభరితంగా జరుగుతున్నాయి. ప్రపంచ చదరంగ సమాఖ్య, అఖిల భారత చదరంగ సమాఖ్య, ఎసిఎ సౌజన్యంతో పోటీలు జరుగుతున్నాయి. 10 లక్షల నగదు బహుమతితో నిర్వహిస్తున్న భారతీయ నవీన క్రీడా ఉత్సవ్ 2వ ఇంటర్నేషనల్ బిలో 1800 ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్-2025 పోటీల్లో రెండో రోజు పోటీలు హోరాహోరీగా సాగాయి. రెండో రోజు పోటీలను ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొండిశెట్టి రాజేంద్ర - ఐకాన్ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్, ప్రత్యేక అతిథి సుమన్, సెక్రటరీ, ది ఆంధ్రప్రదేశ్ చెస్ అసియేషన్, అడ్వకేట్ షేక్ నజీర్, టోర్నమెంట్ కన్వీనర్ ఎస్‌కె ఖాసిం ప్రారంభించారు. బిఎన్‌కెయు ఫౌండేషన్ కోశాధికారి నరేష్, సెక్రటరీ విత్తనాల కుమార్, వైస్ ప్రెసిడెంట్ అమ్మిన ఉదయ్ కుమార్ నాయుడు, మొదటి ఎత్తు వేసి ఆరో రెండు పోటీలను ప్రారంభించారు. కిరికిస్తాన్ దేశంలో, ఏషియన్ డిజేబులిటీస్ ఓపెన్ చెస్ ఛాంపియన్షిప్ విజేతగా నిలిచిన వెంకటకృష్ణ కార్తీక్ ప్రపంచ డిజబులిటీస్ ఓపెన్ చెస్ ఛాంపియన్షిప్ పోటీలకు అర్హత సాధించిన సందర్భంగా అతిథులు వెంకటకృష్ణ కార్తీక్ ప్రత్యేకంగా సన్మానించారు. దేశవ్యాప్తంగా 450 మంది క్రీడాకారులు పాల్గొంటున్న ఈ టోర్నమెంట్లో ఆరు రౌండ్ల పోటీలు ముగిసేసరికి ఇద్దరు క్రీడాకారులు ముందంజలో ఉండగా, తెలంగాణ రాష్ట్రానికి చెందిన సమర తేజ 6/6 పాయింట్లతో ఆధిక్యంలో ఉన్నాడు.

అతిథి వెంకట కృష్ణ కార్తీన్‌ను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.